www.udyamakeratam.com

PRGI No. : TGTEL/25/A0273

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షితః

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 124 | 25-10-2026 | ఆదివారం | పేజీలు: 8 | వెల : రూ.2/-



## ఎన్నికల కోసం విద్యార్థుల పోరు

4

- విద్యార్థి సంఘం పునరుద్ధరణ కోసం ఆమరణ నిరాహార దీక్షలు
- నిరసన టెంట్ల తొలగింపు ప్రయత్నంతో భద్రతా సిబ్బందితో ఘర్షణ
- 2006 నుంచి నిలిచిపోయిన విద్యార్థి సంఘం ఎన్నికలు
- క్యాంపస్‌లోకి ప్రవేశించిన కాంగ్రెస్ ఎంపీలపై రిజిస్ట్రార్ ఆరోపణలు

## ఆపరేషన్ సిందూర్.. ట్రంప్ నోట మళ్లీ అదే పాట!

- భారత్-పాక్ యుద్ధాన్ని తానే ఆపానంటూ ప్రకటన
- ఎనిమిది యుద్ధాలను నిలువరించానని వ్యాఖ్యలు
- శాంతి నెలకొల్పానని వెల్లడి

4





## గోబెల్స్‌ను మించిన బీఆర్ఎస్

- మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల వైఫల్యాలపై తప్పుడు ప్రచారం
- ఎల్‌నినో పరిస్థితులను రాజకీయాలకు వాడుకుంటున్నారు
- పదేళ్ల పాలనలో సాగునీటి రంగాన్ని సర్వనాశనం చేశారు
- బీఆర్ఎస్ నేతలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫైర్

వివరాలు 2వ పేజీలో




# డిఫెన్స్ హబ్‌గా తెలంగాణ

### రక్షణ ఉత్పత్తుల ఎగుమతుల్లో భారత్ నెంబర్ వన్ కావాలి

### లక్ష్య సాధనలో పూర్తి సహకారం నాది.. ఇది నా హామీ!

- రక్షా ఎక్స్‌పో కర్టెన్ రైజర్‌లో సీఎం రేవంత్ రెడ్డి పిలుపు
- డిసెంబర్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్‌కు ఆహ్వానం



రక్షణ రంగంలో ఆయుధాలు, సాంకేతికతను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి భారతదేశం ఎదగాలని, ఆ మహా సంకల్పంలో తెలంగాణ అతిపెద్ద 'డిఫెన్స్ ఇండస్ట్రియల్ హబ్'గా మారబోతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. పెట్టుబడిదారుల లక్ష్య సాధనలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చిన ఆయన.. తమ దార్శనికతకు అనుగుణంగా త్వరలోనే 'ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీ 2.0'ను తీసుకురాబోతున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్ వేదికగా ప్రతిష్టాత్మకంగా జరిగిన 'రక్షా ఎక్స్‌పో 2026 కర్టెన్ రైజర్' ఆవిష్కరణ కార్యక్రమంలో జాతీయ, అంతర్జాతీయ రక్షణ రంగ దిగ్గజాలను ఉద్దేశించి ఆయన ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు.

- ఉద్యమ కెరటం, హైదరాబాద్

వివరాలు 2వ పేజీలో

## తుమ్మిడిహట్టిపై ముంబైలో కీలక భేటీ!

రేపు మహారాష్ట్ర సీఎంతో సీఎం రేవంత్ చర్చలు



## అధికారుల నిర్లక్ష్యం సహించం!

- ఉపాధి పనుల అమలులో వెనుకబడితే చర్యలు
- మహిళలు రాజకీయంగా, సామాజికంగా ఎదగాలి: మంత్రి సీతక్క

2

# హస్తినపై మళ్లీ కేసీఆర్ గురి?

### ఢిల్లీ రాజకీయాల్లో కీలక పాత్రపై కేటీఆర్ సంకేతాలు

కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా కొత్త కూటమి యత్నమా?



- శ్రేణుల్లో ఉత్సాహం నింపేందుకేనంటున్న విశ్లేషకులు
- థర్డ్ ఫ్రంట్ ఏర్పాటులో ఆచరణాత్మక సవాళ్లే కీలకం

వరుస పరాజయాలతో ఢీలాపడిన పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే వ్యూహమో లేక నిజంగానే హస్తినపై గురిపెట్టారో కానీ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మళ్లీ జాతీయ రాజకీయాల వైపు చూస్తున్నారన్న చర్చ జోరందుకుంది. కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా ప్రాంతీయ పార్టీలను ఏకం చేసి ఢిల్లీలో ఆయన కీలక పాత్ర పోషించనున్నారంటూ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి. ఆచరణలో ఎన్నో సవాళ్లున్నా.. త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికల వేళ కేడర్‌లో భరోసా కల్పించేందుకే గులాబీ నాయకత్వం ఈ కొత్త కూటమి అంశాన్ని తెరపైకి తెచ్చిందనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి.

3

## ఏఐ భూతం కాదు.. అవకాశాల గని



- ఉద్యోగాలు హరిస్తుందన్న భయం వద్దు
- నైపుణ్యాలు పెంచుకోవాలి
- కేటీఆర్

3

## రాజకీయాలు కాదు.. ప్రజలకు అండగా నిలవాలి!



- ఎల్‌నినో విపత్తు సమయంలో బురదజల్లడం సరికాదు
- ప్రతిపక్షాలకు హితవు పలికిన డిప్యూటీ సీఎం భట్టి
- విద్యుత్ డిమాండ్, భూగర్భ జలాల కొరతపై ఆందోళన
- ఉన్న నీటిని తాగు అవసరాలకేవాడాలని విజ్ఞప్తి

3



## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు పక్కా!

2

- న్యాయపరమైన చిక్కులు లేకుండా అందజేస్తాం
- ఎవరూ ఆందోళన చెందొద్దు: మంత్రి పొంగులేటి

## క్లోరోఫామ్ లీకేజీ.. హెచ్ఆర్సీ సీరియస్!

సరకా ల్యాబ్స్‌లో కార్మికుల మృతిపై సుమోటో కేసు




3



## కాంగ్రెస్ సర్కారుపై బీజేపీ సమరశంఖం!

- కాంగ్రెస్ వైఫల్యాలపై మహా పాదయాత్రలు
- రాష్ట్ర పదాధికారుల భేటీలో కీలక నిర్ణయాలు

3

## కామన్ ఫెసిలిటీ సెంటర్!

- కరీంనగర్ జిల్లా రుక్మాపూర్‌లో చర్మ శుద్ధి కర్మాగారాలు
- జమ్మికుంట, ఆర్మూర్‌లో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లు
- ఉన్నతస్థాయి సమీక్షలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

2



ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
ఆదివారం 25 అక్టోబర్ 2026



# తుమ్మిడిహట్టిపై ముంబైలో కీలక భేటీ!

**సోమవారం మహారాష్ట్ర సీఎంతో సీఎం రేవంత్ చర్చలు**

**బ్యారేజీ ఎత్తు 152 మీటర్లు ఉండాలని తెలంగాణ పట్టు**

**మంగళవారానికి కేఆర్ఎంబీ సమావేశం వాయిదా**

**హైదరాబాద్, అక్టోబర్ 24 (ఉద్యమ కెరటం):** తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్రతో చర్చించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. సోమవారం ముంబైలో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమావేశం కానున్నారు. గతంలో 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర అంగీకరించగా, దానివల్ల ఆశించిన ప్రయోజనం ఉండదని తెలంగాణ భావిస్తోంది. అందుకే 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించేలా మహారాష్ట్రను ఒప్పించడమే లక్ష్యంగా సాంకేతిక నివేదికలను ప్రభుత్వం సిద్ధం చేసింది. ముఖ్యమంత్రి ముంబై పర్యటన నేపథ్యంలో సోమవారం జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సమావేశం మంగళవారానికి వాయిదా పడింది. బీఆర్ఎస్ పాలనలో కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజీ బీఆర్ఎస్ హయాంలోనే దెబ్బతిన్నదని విమర్శించారు. బ్యారేజీ గేట్లు మూయొద్దని ఎన్‌డీఎస్‌ఏ స్పష్టం చేసిందని, అలాంటప్పుడు పంపుల ద్వారా నీటిని ఎలా ఎత్తిపోస్తామని ఆయన బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. ఎల్‌నినో పరిస్థితుల్లో తలెత్తిన ఇబ్బందులకు గత ప్రభుత్వ విధానాలే కారణమని ఆయన ఆరోపించారు

# గోబెల్స్‌ను మించిపోయిన బీఆర్ఎస్ నేతలు!

**మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల వైఫల్యాలపై తప్పుడు ప్రచారం**

**ఎల్‌నినో పరిస్థితులను రాజకీయాలకు వాడుకుంటున్నారు**

**పదేళ్ల పాలనలో సాగునీటి రంగాన్ని సర్వనాశనం చేశారు**

**బీఆర్ఎస్ నేతలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫైర్**

**హైదరాబాద్, అక్టోబర్ 24 (ఉద్యమ కెరటం):** మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటూ, ఎల్‌నినో పరిస్థితులను సైతం తమ రాజకీయాలకు వాడుకునేందుకు బీఆర్ఎస్ నేతలు తీవ్ర దుష్ప్రచారం



చేస్తున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల ప్రచారం హిట్లర్ మంత్రి గోబెల్స్‌ను మించిపోయిందని విమర్శించారు. సచివాలయంలో శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నీటిపారుదల రంగాన్ని సర్వనాశనం చేశారని, కల్వకుర్తి, నెట్టెంపాడు, ప్రాణహిత తదితర ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసి ఉంటే ప్రస్తుత కరువు పరిస్థితుల్లో రైతులకు ఈ కష్టాలు తప్పేవని అన్నారు. అవినీతి, అనాలోచిత నిర్ణయాలు, పేలవమైన డిజైన్ల వల్లే మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతిన్నదని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) తేల్చిందని స్పష్టం చేశారు.

### మూడు బ్యారేజీలు లేకుండానే రికార్డు సాగు..

ఎన్డీఎస్ఏ సూచనల మేరకే మూడు బ్యారేజీల గేట్లను ఎత్తి ఉంచామని మంత్రి తెలిపారు. అయితే ఆ మూడింటిని వాడుకోకుండానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో రికార్డు స్థాయిలో వరి సాగు, ధాన్యం కొనుగోళ్లు సాధించామని ఆయన గుర్తుచేశారు. ఈ బ్యారేజీల పునరుద్ధరణపై తమకు ఎలాంటి రాజకీయ దురుద్దేశాలు లేవని, జాతీయ, అంతర్జాతీయ నిపుణుల సలహాలతో పనులు ముందుకు తీసుకెళ్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో మంత్రి వివేక్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, పలువురు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు పక్కా!

**న్యాయపరమైన చిక్కులు లేకుండా అందజేస్తాం**

**ఎవరూ ఆందోళన చెందొద్దు: మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్, అక్టోబర్ 24 (ఉద్యమ కెరటం):** రాష్ట్రంలో కొన్నేళ్లుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టుల కలను తమ ప్రజా ప్రభుత్వం కచ్చితంగా నెరవేరుస్తుందని రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. చట్టపరమైన చిక్కులు లేకుండా, నివాసయోగ్యమైన ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 2008లో వైఎస్సార్ హయాంలో స్థలాలు కేటాయించగా సుప్రీంకోర్టు కేసుల వల్ల ఆగిపోయిందన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు తుది తీర్పుతో ఎదురైన న్యాయపరమైన అడ్డంకులకు శాశ్వత పరిష్కారం చూపేలా సీఎం రేవంత్‌తో చర్చించామన్నారు. ఎవరూ ఆందోళన చెందొద్దని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే జర్నలిస్టులకు స్థలాలు ఇచ్చిందని.. మళ్లీ కాంగ్రెస్ పాలనలోనే ఇస్తామని భరోసా ఇచ్చారు.

### రూ.150 కోట్లతో కరువు నివారణ..

రాష్ట్రంలో కరువు పరిస్థితులను తట్టుకునేలా మూడు మండలాల్లో రూ.150 కోట్లతో శాశ్వత నివారణ చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. శనివారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్, నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునూతల, నారాయణపేట జిల్లా మక్తల్ మండలాలను ఇందుకు ఎంపిక చేసినట్లు చెప్పారు. జాతీయ విపత్తుల నిర్వహణ నిధి (ఎన్‌డీఎఫ్) సహకారంతో చేపట్టే ఈ ప్రాజెక్టును పక్కాగా అమలు చేయాలన్నారు. ఖర్చు చేసే ప్రతి రూపాయి పేదలు, రైతులకు చేరేలా పారదర్శకంగా పనులు జరగాలని అధికారులను ఆదేశించారు.

# డిఫెన్స్ హబ్‌గా తెలంగాణ!

- రక్షణ ఉత్పత్తుల ఎగుమతుల్లో భారత్ నెంబర్ వన్ కావాలి
- లక్ష్య సాధనలో పూర్తి సహకారం నాది..
- రక్షా ఎక్స్‌పో కర్టెన్ రైజర్‌లో సీఎం రేవంత్ రెడ్డి పిలుపు

**హైదరాబాద్, అక్టోబర్ 24 (ఉద్యమ కెరటం):** రక్షణ రంగంలో భారతదేశాన్ని ప్రపంచంలోనే శక్తివంతమైన అగ్రగామి దేశంగా తీర్చిదిద్దేందుకు పారిశ్రామికవేత్తలంతా కలిసి రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. 'తెలంగాణ రైజింగ్ 2047' దార్శనికతకు అనుగుణంగా రాష్ట్రంలో త్వరలోనే 'ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీ 2.0'ను తీసుకురాబోతున్నట్లు ఆయన వెల్లడించారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా హైదరాబాద్‌లోని తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'రక్షా ఎక్స్‌పో 2026 కర్టెన్ రైజర్'ను ప్రారంభించి, లోగోను ఆవిష్కరించారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

### దిగుమతుల నుంచి.. ఎగుమతుల స్థాయికి..

రక్షణ రంగంలో భారత్‌ను ప్రపంచ స్థాయిలో అగ్రగామిగా చూడాలన్నదే తన ఆకాంక్ష అని సీఎం పేర్కొన్నారు. యుద్ధానికి అవసరమైన సాంకేతికతను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే స్థాయి నుంచి.. స్వావలంబన సాధించడంతో పాటు సాంకేతికతను ఎగుమతి చేసే దేశంగా భారత్ ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ లక్ష్య సాధనలో తెలంగాణ గణనీయమైన పాత్ర పోషిస్తోందన్నారు. దేశ రక్షణ రంగ పరిశ్రమకు తెలంగాణ అతిపెద్ద పారిశ్రామిక కేంద్రంగా (హబ్) ఎదగాలని, అందుకు అందరి సహకారం అవసరమని సీఎం కోరారు. "రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని మీరు వేసుకున్న ప్రణాళికలను రెట్టింపు చేయండి. మీ లక్ష్య సాధనకు నా నుంచి ఎలాంటి సహకారం కావాలో చెప్పండి.. సహకరించడానికి నేను సిద్ధంగా ఉన్నా. ఇది నా హామీ" అని పారిశ్రామికవేత్తలకు స్పష్టం చేశారు.

### 2047 నాటికి పది శాతం వాటా..

రాష్ట్ర రక్షణ రంగంతో పాటు ఏరోస్పేస్, స్పేస్, సైబర్ సెక్యూరిటీ, డ్రోన్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ) వంటి అనుబంధ రంగాల్లో పారిశ్రామికవేత్తలు లక్ష్యాలను సాకారం చేయాలని సీఎం కోరారు. గతేడాది విడుదల చేసిన 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌లో భాగంగా.. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. దేశ జనాభాలో తెలంగాణ వాటా 2.5 శాతంగా ఉందని, దేశ స్థూల జాతీయోత్పత్తిలో 5 శాతం వాటాను అందిస్తోందని.. దీన్ని 2047 నాటికి 10 శాతానికి పెంచడమే తన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. ఈ దార్శనికత సాకారంలో రక్షా ఎక్స్‌పో ప్రధాన వేదికగా మారుతుందన్నారు. ఈ రంగంలో వినూత్న ఆలోచనలు, సరికొత్త సాంకేతికతను తీసుకురావాలని.. అందుకు అనువైన వాతావరణాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో యుద్ధ స్వరూపం పూర్తిగా మారనుందని, డ్రోన్లు, రోబోలు, కృత్రిమ మేధతో పనిచేసే వ్యవస్థలు యుద్ధ రంగాన్ని మార్చబోతున్నాయని గుర్తుచేశారు.

### అత్యంత వ్యూహాత్మక కేంద్రం హైదరాబాద్!

భారత రక్షణ వ్యవస్థలో హైదరాబాద్ అత్యంత వ్యూహాత్మకమైన, సురక్షితమైన నగరమని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. ఎన్నో ప్రతిష్టాత్మక పరిశోధనా సంస్థలకు ఇది నిలయమని, ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన కీలక వ్యూహాత్మక కేంద్రాలు ఇక్కడి నుంచే పనిచేస్తున్నాయన్నారు. దక్షిణ భారతదేశంలో సముద్ర తీరం లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ అయినప్పటికీ.. నౌకాదళానికి సైతం కీలక సేవలు అందిస్తోందని, వికారాబాద్ జిల్లా దామగుండంలో నిర్మిస్తున్న అత్యంత తక్కువ పౌనఃపున్యాల (వీఎల్ఎఫ్) రాడార్ కేంద్రమే ఇందుకు నిదర్శనమని వివరించారు. వచ్చే డిసెంబర్



7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో మరింత భారీ స్థాయిలో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'లో పాల్గొనాలని ప్రతినిధులను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో దేశ, విదేశీ రక్షణ, అంతరిక్ష సంస్థల ప్రతినిధులు విశేషంగా పాల్గొన్నారు. డీఆర్డీవో, హెచ్ఏఎల్, బీడీఎల్, మిధాని, టాటా, ఎయిర్‌బస్, సాఫ్రాన్, స్కైరూట్, లాక్‌హీడ్ మార్టిన్, భారత్ ఫోర్జ్ వంటి ప్రముఖ సంస్థలకు చెందిన వారు హాజరయ్యారు. అమెరికా కాన్సులేట్ జనరల్ (హైదరాబాద్) లారా విలియమ్స్, భారత్ ఫోర్జ్ సీఎండీ బాబా కల్యాణి, స్కైరూట్ సీఈఓ పవన్ కుమార్ చందన, డీఆర్డీవో మాజీ చైర్మన్ డాక్టర్ సతీష్ రెడ్డి, లాక్‌హీడ్ మార్టిన్ హెడ్ మైకెల్ ఫెర్నాండెజ్, ఎల్ అండ్ టీ ప్రతినిధి అరుణ్ రాంచందాని, ధ్రువ స్పేస్ కో-ఫౌండర్ సంజయ్ నెక్కంటి, సాఫ్రాన్ సీఈఓ జితేంద్ర గవాంకర్, ఎయిర్‌బస్ డిఫెన్స్ స్పేస్ ప్రెసిడెంట్ వెంకట్ కట్కూరిలతో పాటు రక్షణ శాఖ సీనియర్ అధికారులు, మాజీ ఉన్నతాధికారులు, రాష్ట్ర హోం శాఖ కార్యదర్శి శిఖా గోయల్ పాల్గొన్నారు. రక్షణ రంగానికి చెందిన భాగస్వాములందరినీ ఒకే వేదికపైకి తెచ్చి పరస్పరం చర్చించుకునేలా రక్షా ఎక్స్‌పోను ఒక అంతర్జాతీయ వేదికగా తీర్చిదిద్దాలన్నదే తన ఆలోచన అని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.

# అధికారుల నిర్లక్ష్యం సహించం!

- ఉపాధి పనుల అమలులో వెనుకబడితే చర్యలు
- అర్హులకు వెంటనే జాబ్ కార్డులు మంజూరు చేయాలి
- మహిళలు రాజకీయంగా, సామాజికంగా ఎదగాలి: మంత్రి సీతక్క

**హైదరాబాద్, అక్టోబర్ 24 (ఉద్యమ కెరటం):** ఉపాధి హామీ పనుల విషయంలో అధికారుల నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించేది లేదని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) హెచ్చరించారు. శనివారం ఆమె ఉపాధి హామీ పథకం అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనులు ప్రారంభించని డీఆర్‌డీఓలు, జాబ్ కార్డులు ఇవ్వడంలో జాప్యం చేస్తున్న ఎంపీడీఓలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నవంబర్ 1 నాటికి క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించాలని, స్థానిక అవసరాలకు తగినట్లుగా పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. పాఠశాల ప్రహరీలు, కమ్యూనిటీ హాళ్లు తదితర నిర్మాణాలను వేగవంతం




చేయాలన్నారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఎనిమిది నెలల సమగ్ర కార్యాచరణను రూపొందించాలని సూచించారు. కాలువల మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

### జర్నలిస్టులకు రక్షణ ఏదీ?

అధికారాన్ని ప్రశ్నించే మహిళా జర్నలిస్టులను శత్రువులుగా చూడటం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని మంత్రి సీతక్క ఆందోళన వ్యక్తం చేశారు. బేగంపేటలో నిర్వహించిన నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఉమెన్ జర్నలిస్ట్స్ సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీజేపీ, ఆర్ఎస్ఎస్ అధికారంలో ఉన్న సందర్భాల్లో మహిళల భద్రతపై దాడులు పెరుగుతున్నాయని విమర్శించారు. నిరసనలను కవర్ చేస్తున్న మహిళా జర్నలిస్టులపై దాడులు జరగడం దారుణమన్నారు. వారిపై నమోదైన కేసులను నిష్పక్షపాతంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా జర్నలిస్టులు ఐక్యంగా నిలబడాలని పిలుపునిచ్చారు.

### పట్టుదలతో ముందుకు సాగాలి..

మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగి అన్ని రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు. మహిళలు రాజకీయాల్లో ఎదిగే క్రమంలో ఎదురయ్యే అడ్డంకులకు భయపడొద్దని సూచించారు. మాదాపూర్‌లో 'మహిళా రాజకీయ నాయకత్వం' అంశంపై జరిగిన సదస్సులో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని తాను ఈ స్థాయికి వస్తానని ఎన్నడూ ఊహించలేదన్నారు. ప్రజలతో సంబంధం లేకుండా నాయకుడు రాజకీయంగా నిలబడలేడన్నారు. మహిళలు ఎంత ఉన్నత స్థానాలకు చేరినా వివక్ష ఎదుర్కోవాల్సి వస్తోందని, అయినా అంకితభావం, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు



# గచ్చిబౌలిలో కామన్ ఫెసిలిటీ సెంటర్!

**లెదర్ ఇండస్ట్రీ, ఎస్సీ పారిశ్రామికవేత్తల ప్రోత్సాహమే లక్ష్యం**

**ఉన్నతస్థాయి సమీక్షలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి**

**హైదరాబాద్, అక్టోబర్ 24 (ఉద్యమ కెరటం):** రాష్ట్రంలో లెదర్ ఇండస్ట్రీని మరింత బలోపేతం చేయడంతో పాటు ఔత్సాహిక ఎస్సీ యువతను పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించేందుకు గచ్చిబౌలిలో ప్రత్యేకంగా 'కామన్ ఫెసిలిటీ సెంటర్' (సీఎఫ్‌సీ) ఏర్పాటు చేయనున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. శనివారం సచివాలయంలో టీజీఎల్ఐపీసీ ఉన్నతాధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అంతర్జాతీయ హంగులతో గచ్చిబౌలిలో హబ్ అండ్ స్పోక్ విధానంలో మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. దీని ద్వారా రాష్ట్రంలోని ఆర్టిజన్ల ఉత్పత్తులకు అదనపు విలువ (వాల్యూ యాడెడ్) జోడిస్తామని, డిజైనింగ్ మొదలు బ్రాండింగ్ వరకు వారికి మార్గనిర్దేశం చేస్తామని మంత్రి వివరించారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రుక్మాపూర్‌లో సుమారు వెయ్యి మందికి ఉపాధి కల్పించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో పర్యావరణహిత చర్మ శుద్ధి కర్మాగారాలను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి చెప్పారు. హుజురాబాద్ నియోజకవర్గం పరిధిలోని జమ్మికుంటతో పాటు ఆర్మూర్‌లో ఎంఎస్ఈసీడీపీ కింద ప్లగ్ అండ్ ప్లే విధానంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను అందుబాటులోకి తెస్తామన్నారు. గతంలో లిడ్‌క్యాప్‌కు ఎక్కడెక్కడ భూములు కేటాయించారు? వాటి ప్రస్తుత పరిస్థితి ఏమిటనే దానిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

# ప్రజలకు అండగా నిలవాలి!

- ఎల్‌నినో విపత్తు సమయంలో బురదజల్లడం సరికాదు
- ప్రతిపక్షాలకు హితవు పలికిన డిప్యూటీ సీఎం భట్టి
- విద్యుత్ డిమాండ్, భూగర్భ జలాల కొరతపై ఆందోళన
- ఉన్న నీటిని తాగు అవసరాలకే వాడాలని విజ్ఞప్తి

**హైదరాబాద్, అక్టోబర్ 24 (ఉద్యమ కెరటం):** రాష్ట్రం ఎల్‌నినోతో తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న తరుణంలో ప్రతిపక్షాలు బురదజల్లే రాజకీయాలు మాని, ప్రజలకు అండగా నిలవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హితవు పలికారు. శనివారం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కరోనా సమయంలో ప్రధాని మోదీ పిలుపుకు ప్రజలు స్పందించి ప్రభుత్వాలకు అండగా నిలిచారని, ఇప్పుడు కూడా అలాగే సమష్టిగా విపత్తును ఎదుర్కోవాలన్నారు. బురదజల్లే రాజకీయాల కన్నా మంచి సలహాలు ఇవ్వాలని ప్రతిపక్షాలకు సూచించారు.

### విద్యుత్ డిమాండ్ 20,018 మెగావాట్లకు..

రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని, గతంలో 6,648 మెగావాట్లు ఉన్న గరిష్ఠ డిమాండ్ ఇప్పుడు 20,018 మెగావాట్లకు చేరిందని భట్టి వివరించారు. ఎండల తీవ్రతతో ఇళ్లు, వ్యవసాయం, లిఫ్ట్ ఇరిగేషన్లలో విద్యుత్ వాడకం పెరిగిందన్నారు. మరోవైపు జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడంతో జల విద్యుత్ ఉత్పత్తి కూడా తగ్గుతోందని



ఆందోళన వ్యక్తం చేశారు. డిమాండ్‌ను తట్టుకునేందుకు ముందస్తు ప్రణాళికలతో కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణాలు వేగవంతం చేశామన్నారు.

### నీటిని పొదుపుగా వాడాలి..

రాష్ట్రంలో ఉన్న 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లలో సగానికి పైగా భూగర్భ జలాల కొరతతో ఉన్నాయని భట్టి వెల్లడించారు. నీరు లేని బోర్లలో మోటార్లు ఆన్ చేయొద్దని, అలా చేస్తే కాలిపోవడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లపై భారం పడుతుందని రైతులను హెచ్చరించారు. రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి మట్టాలు దారుణంగా పడిపోయాయని, ఉన్న నీటిని వ్యవసాయం కంటే తాగునీటికే ప్రాధాన్యమిచ్చి పొదుపుగా వాడుకోవాలని కోరారు. వ్యవసాయం తగ్గితే గ్రామీణ కూలీలు, రైతులకు ఉపాధి కల్పించేలా ఉపాధి హామీ పథకం కింద 9.1 లక్షల పనులను గుర్తించామని, మరో ఎనిమిది లక్షల పనుల గుర్తింపునకు చర్యలు చేపట్టామని భరోసా ఇచ్చారు. విపత్తు వేళ ప్రభుత్వ యంత్రాంగం, ప్రజలు సమష్టిగా పని చేయాలని డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు.

# హస్తినపై మళ్లీ కేసీఆర్ గురి?

- ఢిల్లీ రాజకీయాల్లో కీలక పాత్రపై కేటీఆర్ సంకేతాలు
- కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా కొత్త కూటమి యత్నమా?
- శ్రేణుల్లో ఉత్సాహం నింపేందుకేనంటున్న విశ్లేషకులు
- థర్డ్ ఫ్రంట్ ఏర్పాటులో ఆచరణాత్మక సవాళ్లే కీలకం



**హైదరాబాద్, అక్టోబర్ 24 (ఉద్యమ కెరటం):** ప్రస్తుతం తెలంగాణ రాజకీయాలకే పరిమితమైన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) మళ్లీ జాతీయ రాజకీయాలపై దృష్టి సారిస్తోందా? పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఢిల్లీ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించనున్నారంటూ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు తెరలేపాయి. తెలంగాణ భవన్‌లో అంబర్‌పేట నియోజకవర్గ నేతలతో జరిగిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పరిస్థితి, కాంగ్రెస్ నాయకత్వంపై విమర్శలు చేస్తూనే దేశ రాజకీయాల్లో ప్రత్యామ్నాయ శక్తులకు మంచి అవకాశాలున్నాయని అభిప్రాయపడ్డారు. దీంతో గులాబీ దళపతి మరోసారి హస్తిన రాజకీయాల వైపు అడుగులు వేస్తారా అన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

### ప్రాంతీయ పార్టీలతో కొత్త కూటమి?

గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి సొంతంగా మెజారిటీ రాకపోవడంతో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల మద్దతుతో కేంద్ర ప్రభుత్వం కొనసాగుతోంది. మరోవైపు ఇండియా కూటమిలోనూ వివిధ అంశాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా ప్రాంతీయ పార్టీలను ఏకం చేసే దిశగా కేసీఆర్ మళ్లీ పావులు కదుపుతారా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. గతంలోనూ ఆయన ఇలాంటి ప్రయత్నాలు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదు. ఇప్పుడు సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్, బిజూ జనతాదళ్, జేడీఎస్, వైఎస్సార్‌సీపీ వంటి పార్టీలతో సమన్వయం సాధించడం సాధ్యమేనా అన్నది కీలకంగా మారింది. అయితే ఆయా పార్టీలతో కేసీఆర్ చర్చలు జరుపుతున్నట్లు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక సమాచారం లేదు.

### కేడర్‌లో భరోసా నింపే వ్యూహమా?

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, పలువురు ఎమ్మెల్యేలు పార్టీని వీడటంతో బీఆర్ఎస్ ప్రస్తుతం రాజకీయ సవాళ్లను ఎదుర్కొంటోంది. రాబోయే ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడం గులాబీ నాయకత్వానికి అత్యంత ముఖ్యంగా మారింది. కార్యకర్తల్లో ఉన్న సందిగ్ధతను తొలగించి, కేసీఆర్ నాయకత్వంపై భరోసా పెంచే వ్యూహంలో భాగంగానే జాతీయ రాజకీయాల అంశాన్ని తెరపైకి తెచ్చారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

### ఆచరణలో ఎన్నో సవాళ్లు..

జాతీయ స్థాయిలో ప్రత్యామ్నాయ కూటమి (థర్డ్ ఫ్రంట్) ఏర్పాటు చేయడం మాటల్లో సులభమైనా ఆచరణలో అనేక సవాళ్లున్నాయి. ఆయా ప్రాంతీయ పార్టీల రాష్ట్ర ప్రయోజనాలు, కేంద్రంతో సంబంధాలు, ఉమ్మడి నాయకత్వంపై ఏకాభిప్రాయం కుదరడం అంత తేలిక కాదు. మరోవైపు బీఆర్ఎస్ జాతీయ రాజకీయాలపై చేస్తున్న వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు తప్పుబడుతున్నారు. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని, ముందు రాష్ట్రంలో పార్టీని కాపాడుకోవాలని ఎద్దేవా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ నిజంగానే హస్తిన బాట పట్టి కొత్త కార్యాచరణ ప్రకటిస్తారా? లేక రాష్ట్రంలో పార్టీ పునరుద్ధరణపైనే దృష్టి పెడతారా? అన్నది రానున్న రోజుల్లో తేలనుంది

# కాంగ్రెస్ సర్కారుపై బీజేపీ సమరశంఖం!

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కదంతొక్కుతున్న కమలదళం
- కాంగ్రెస్ వైఫల్యాలపై రాష్ట్రవ్యాప్తంగా మహా పాదయాత్రలు
- ముంచుకొస్తున్న కరెంట్, నీటి సంక్షోభంపై పోరుబాట
- పాలమూరు నీళ్లను డిండికి తరలిస్తే సహించం: ఎంపీ డీకే అరుణ
- బీజేపీ రాష్ట్ర పదాధికారుల భేటీలో కీలక నిర్ణయాలు



**హైదరాబాద్, అక్టోబర్ 24 (ఉద్యమ కెరటం):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, నిరంకుశ పోకడలపై క్షేత్రస్థాయిలో పోరాటాలు ఉధృతం చేయాలని భారతీయ జనతా పార్టీ నిర్ణయించింది. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అధ్యక్షతన రాష్ట్ర పదాధికారులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశాలు జరిగాయి. ఈ భేటీలకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌ఛార్జి సునీల్ బన్సల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బూత్ స్థాయి నుంచి కార్యకర్తలు సమాయత్తం కావాలని రామచందర్‌రావు దిశానిర్దేశం చేశారు. ప్రజాస్వామ్య అణచివేతకు వ్యతిరేకంగా 'లోక్‌తంత్ర బచావో ఉ భీడ్‌తంత్ర హటావో' పేరిట ఉద్యమించాలని తీర్మానించారు.

### జిల్లా కేంద్రాల్లో మహా పాదయాత్రలు..

రాష్ట్రంలో రాబోయే రోజుల్లో తీవ్రమైన కరెంట్, తాగు, సాగునీటి ఎద్దడి పొంచి ఉందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతమ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ముందే హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం సరైన ప్రణాళికలు లేకుండా చేతులెత్తేసిందన్నారు. గత బీఆర్ఎస్ సర్కారు వనరుల దుబారా, నేటి కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి దాపురించిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో భారీ ఎత్తున 'మహా పాదయాత్రలు' చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు.

### మా రైతుల పొట్టగొడితే సహించం: డీకే అరుణ

పాలమూరు ప్రజల ఆశీర్వాదంతో ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డికి ఆ జిల్లాపై ఏమాత్రం ప్రేమ లేదని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి నీటిని డిండి లిఫ్ట్ ద్వారా తరలించాలని చూడటం పచ్చి ద్రోహమన్నారు. శ్రీశైలం బ్యాక్ వాటర్స్ నుంచి వచ్చే ప్రతి చుక్కపై మొదటి హక్కు పాలమూరు రైతులదేనని స్పష్టం చేశారు. నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకుని, డిండి లిఫ్ట్ ప్రాజెక్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, ఈ సమావేశాల్లో సహ ఇన్‌ఛార్జులు అభయ్ పాటిల్, రేఖా శర్మ, బీజేపీ శాసనసభ, మండలి పక్ష నేతలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఏవీఎన్ రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, మధుకర్‌జీ తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు కోసం కదం తొక్కిన జనం!

- ట్యాంక్‌బండ్‌పై రెండు వేల మందితో భారీ మానవహారం
- రాష్ట్రంలో 73 లక్షల ఓట్ల తొలగింపుపై తీవ్ర ఆందోళన
- సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించి, ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలి
- 'ఓట్ బచావో.. దేశ్ బచావో' అంటూ సామూహిక ప్రతిజ్ఞ




**హైదరాబాద్ (ఉద్యమ కెరటం):** లక్షలాది మంది పౌరుల ప్రజాస్వామిక ఓటు హక్కులను కాలరాస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై భారీ మానవహారం నిర్వహించారు. పీపుల్ ఎగైనెస్ట్ ఎస్ఐఆర్, పౌర సమాజ, మానవ హక్కుల, రైతు, దళిత, యువజన, విద్యార్థి సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో రెండు వేల మందికి పైగా పౌరులు పాల్గొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌ను విధుల నుంచి తొలగించాలని, సీఈసీ చట్టండ 2023ను ఉపసంహరించుకోవాలని వారు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. తొలగించిన ఓటర్లందరినీ తిరిగి జాబితాలో చేర్చాలని పట్టుబట్టారు.

### సగం ఓట్లు గల్లంతేనా?

దేశవ్యాప్తంగా 13.4 కోట్ల మందిని, తెలంగాణలో ఇప్పటికే 73 లక్షల మందిని ఓటర్ల జాబితా నుంచి తొలగించారని వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మరో 93 లక్షల మందికి అనుమానాస్పద ఓటర్లుగా నోటీసులు అందుతున్నాయని, ఈ పరిస్థితుల్లో దాదాపు 50 శాతం మంది ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇది ఓటర్ల ధ్రువీకరణ కాదని, సామూహిక ఓట్ల తొలగింపు ప్రక్రియ అని విమర్శించారు. ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకోవాల్సింది పోయి, ప్రభుత్వమే తమకు అనుకూలమైన ఓటర్లను ఎంచుకునే విపరీత పోకడ నడుస్తోందని మండిపడ్డారు.

### మైనారిటీలు, పేదలపైనే తీవ్ర ప్రభావం..

ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల ముఖ్యంగా మహిళలు, శ్రామిక పేదలు, ముస్లింలతో సహా ఇతర మైనారిటీలు, ట్రాన్స్‌జెండర్లు తీవ్రంగా నష్టపోతున్నారని, క్షేత్రస్థాయిలో బీఎల్ఓలపైనా విపరీతమైన పనిభారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై జరిగిన పోలీసుల అణచివేతను తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకుంటామని ఈ సందర్భంగా 'ఓట్ బచావో.. దేశ్ బచావో' అంటూ సామూహిక ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఓట్ల తొలగింపు తీవ్రతను వివరిస్తూ బాటసారులకు కరపత్రాలు పంపిణీ చేశారు.

# ఏఐ భూతం కాదు.. అవకాశాల గని!

### ఉద్యోగాలు హరిస్తుందన్న భయం వద్దు
### మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోవాలి
### ఏఐతో కొత్త స్టార్టప్‌లు, భారీగా ఉపాధి మార్గాలు
### రాండమ్ ట్రీస్ సంస్థను ప్రారంభించిన కేటీఆర్



**హైదరాబాద్, అక్టోబర్ 24 (ఉద్యమ కెరటం):** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను దోగాలు హరించే భూతంలా కాకుండా, కొత్త అవకాశాలు సృష్టించే వేదికగా చూడాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ యువతకు పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లో డేటా, ఏఐ ఇన్నోవేషన్ సంస్థ 'రాండమ్ ట్రీస్' భారత ప్రధాన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. గతంలో బ్యాంకింగ్ రంగంలో కంప్యూటర్లు వచ్చినప్పుడు తీవ్రంగా వ్యతిరేకించారని, కానీ అవే కాలక్రమేణా లక్షలాది ఉద్యోగాలకు మార్గం సుగమం చేశాయని గుర్తుచేశారు. ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయనే ఆందోళన వీడి, కొత్త నైపుణ్యాలను (అప్‌స్కిల్లింగ్, రీస్కిల్లింగ్) నేర్చుకుంటూ ప్రపంచ పోటీలో ముందుండాలని సూచించారు.

### వసతులు కల్పిస్తేనే ప్రైవేట్ కొలువులు..

అందరికీ ఉద్యోగాలు ఇవ్వడం ప్రభుత్వాలకు సాధ్యం కాదని, మౌలిక వసతులు, ప్రశాంత వాతావరణం కల్పిస్తే ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు అద్భుతంగా పెరుగుతాయని కేటీఆర్ స్పష్టం చేశారు. గత పదేళ్లలో తమ ప్రభుత్వం హైదరాబాద్‌ను గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు, ఐటీ, ఏఐ పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా మార్చిందని గుర్తుచేశారు. సిరిసిల్లలో 'సాగు-బాగు' కార్యక్రమం ద్వారా ఏఐ సాంకేతికతతో రైతుల పంటలకు సోకే చీడపీడలను నివారించగలిగామన్నారు. భవిష్యత్తులో స్విగ్గీ, జొమాటో, జెప్టో, బ్లింకిట్ తరహాలోనే ఏఐ ఆధారిత స్టార్టప్‌లు కూడా భారీగా కొలువులు సృష్టిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# క్లోరోఫామ్ లీకేజీ.. హెచ్ఆర్సీ సీరియస్!

### సరకా ల్యాబ్స్‌లో ఇద్దరు కార్మికుల మృతిపై సుమోటో కేసు
### నవంబర్ 26లోగా నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌కు ఆదేశం
### జీవించే హక్కుకు భంగం వాటిల్లిందన్న కమిషన్
### పరిశ్రమ మూసివేతకు పీసీబీ ఆదేశాలు




**హైదరాబాద్, అక్టోబర్ 24 (ఉద్యమ కెరటం):** సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం పారిశ్రామికవాడలోని సరకా లేబొరేటరీస్‌లో ఇద్దరు కార్మికులు మృతి చెందిన ఘటనపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్సీ) సుమోటోగా స్పందించింది. ఈనెల 22న రాత్రి క్లోరోఫామ్ ఆవిరి లీకై కార్మికులు చనిపోయిన వార్తలను పరిగణనలోకి తీసుకున్న చైర్‌పర్సన్ జస్టిస్ షమీమ్ అక్తర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇది రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కుకు భంగం కలిగించడమేనని కమిషన్ అభిప్రాయపడింది. ప్రమాదానికి గల కారణాలు, క్షతగాత్రులకు అందుతున్న వైద్యం, పరిశ్రమలో భద్రతా ప్రమాణాలపై నవంబర్ 26లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని సంగారెడ్డి కలెక్టర్‌ను ఆదేశించింది. కాగా, కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) తనిఖీల అనంతరం ఈ పరిశ్రమ మూసివేతకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

# ఏఈఈ పరీక్షను వాయిదా వేయండి!

### ఒకే రోజున ఎస్సెస్సీ జేఈ, టీజీపీఎస్సీ ఏఈఈ పరీక్షలు
### సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు బహిరంగ లేఖ
### ఒడిశా, బీహార్‌లో మార్చినప్పుడు ఇక్కడెందుకు సాధ్యం కాదు?
### భేషజాలకు పోయి నిరుద్యోగులను బలిచేయొద్దని హితవు



**హైదరాబాద్ (ఉద్యమ కెరటం):** నవంబర్ 6న స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ జేఈ), రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీఎస్పీఎస్సీ ఏఈఈ – సివిల్) పరీక్షలు ఒకే రోజు ఉండటంతో అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఏఈఈ పరీక్ష తేదీని మార్చాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి శనివారం ఆయన బహిరంగ లేఖ రాశారు. ఇతర రాష్ట్రాల్లో ఎస్సెస్సీ పరీక్షలు రాసి, వెంటనే తెలంగాణకు వచ్చి ఏఈఈ పరీక్ష రాయడం అభ్యర్థులకు ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. పరీక్షల తేదీల మార్పుపై స్వయంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లేఖ రాసినా పబ్లిక్ సర్వీస్ కమిషన్ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఒడిశా, బీహార్ రాష్ట్రాల్లో పరీక్ష తేదీలు మార్చినప్పుడు తెలంగాణలో ఎందుకు సాధ్యం కాదని నిలదీశారు. ప్రభుత్వం భేషజాలకు పోకుండా వెంటనే జోక్యం చేసుకుని నవంబర్ 6న జరగనున్న ఏఈఈ పరీక్షను వాయిదా వేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## సంపాదకీయం



# హారన్ మోత మోగితే.. జరిమానా వాత తప్పదు!

### రోడ్లపై ఇష్టారాజ్యంగా హారన్లు మోగిస్తే చర్యలు

### మలుపులు, లేన్ మార్పుల్లో ఇండికేటర్ తప్పనిసరి

**రోడ్డెక్కితే హారన్ మోత.. సిగ్నల్ పడితే అసహనం.. ముందు వాహనం కాస్త ఆలస్యంగా కదిలితే చాలు వెనుక నుంచి చెవులు చిల్లులు పడేలా శబ్దాలు! నగరాలు, పట్టణాల్లోనే కాదు.. గ్రామీణ రహదారులపైనా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అవసరం ఉన్నా లేకపోయినా హారన్ మోగించడం కొందరికి అలవాటుగా మారిపోయింది. మరికొందరైతే మలుపులు తిరిగేటప్పుడు ఇండికేటర్ వేయడం కూడా అనవసరమన్నట్లు వ్యవహరిస్తున్నారు. రహదారిపై తమకు మాత్రమే హక్కు ఉన్నట్లు ప్రవర్తిస్తూ ఇతరుల భద్రతను ప్రమాదంలో పడేస్తున్నారు. ఇలాంటి నిర్లక్ష్యపు అలవాట్లు కేవలం ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలే కాదు.. సమాజంలో పెరుగుతున్న అసహనానికి, క్రమశిక్షణ లోపానికి నిదర్శనాలు.**

వాహనాలకు హారన్ ఏర్పాటు చేసిన ప్రధాన ఉద్దేశం ప్రమాదాలను నివారించడం. ఎదురుగా వచ్చే వాహనదారులను, రహదారి దాటుతున్న పాదచారులను అప్రమత్తం చేయడానికే దాన్ని వినియోగించాలి. కానీ నేడు పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా మారుతోంది. ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఎరుపు దీపం వెలుగుతున్నా వెనుక నుంచి హారన్లు మోగిస్తూనే ఉంటారు. ముందు వాహనం కదలడానికి అవకాశం లేకపోయినా శబ్దాలతో ఒత్తిడి పెంచుతారు. హారన్ మోగిస్తే ట్రాఫిక్ తొలగిపోతుందన్న అపోహలో కొందరు వ్యవహరిస్తున్నారు. ఈ ధోరణి వల్ల రహదారులపై అనవసర శబ్ద కాలుష్యం పెరుగుతోంది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆసుపత్రులు, పాఠశాలలు, నివాస ప్రాంతాల సమీపంలో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది. ఒకరి తొందరపాటు మరొకరి ప్రశాంతతను దెబ్బతీయకూడదన్న కనీస సామాజిక స్పృహ ప్రతి వాహనదారుడిలో ఉండాలి.

#### శబ్ద కాలుష్యం.. కనిపించని ప్రమాదం!

వాయు కాలుష్యం గురించి విస్తృతంగా చర్చిస్తున్న సమాజం శబ్ద కాలుష్యాన్ని మాత్రం పెద్దగా పట్టించుకోవడం లేదు. వాహనాల హారన్లు, అధిక శబ్దం చేసే సైలెన్సర్లు, అదనంగా బిగించిన శబ్ద పరికరాలు ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. నిరంతరం అధిక శబ్దాలకు గురికావడం వల్ల మానసిక ఒత్తిడి, ఏకాగ్రత లోపం, నిద్రకు అంతరాయం వంటి సమస్యలు తలెత్తవచ్చు. అందుకే ప్రకటిత నిశ్శబ్ద ప్రాంతాల్లో హారన్ల వినియోగంపై ప్రత్యేక నియంత్రణలు ఉన్నాయి. అయినప్పటికీ కొందరు వాహనదారులు వాటిని పట్టించుకోవడం లేదు. రాత్రివేళ నివాస ప్రాంతాల్లో పెద్ద శబ్దాలతో హారన్లు మోగించడం ఇతరుల విశ్రాంతికి భంగం కలిగించడమే. శబ్దం చేయగలిగే అవకాశం ఉందని ప్రతిసారీ హారన్ మోగించడం సమంజసం కాదు. రోడ్డు ప్రమాదాలకు అతివేగం, మద్యం మత్తులో వాహనాలు నడపడం మాత్రమే కారణాలు కావు. చిన్నచిన్న నిర్లక్ష్యాలు కూడా తీవ్రమైన ప్రమాదాలకు దారితీస్తాయి. వాటిలో మలుపులు తిరిగేటప్పుడు, లేన్ మారేటప్పుడు ఇండికేటర్ వేయకపోవడం ఒకటి. వాహనం ఏ దిశగా వెళ్తుందో వెనుక వచ్చే వాహనదారులకు ముందుగానే తెలియాలి. అప్పుడే వారు తమ వేగాన్ని, దూరాన్ని సర్దుబాటు చేసుకోగలుగుతారు. కానీ కొందరు అకస్మాత్తుగా మలుపులు తిరుగుతూ ఇతరులను ప్రమాదంలోకి నెడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు, భారీ వాహనాల డ్రైవర్లు ఎవరైనా సరే ఇండికేటర్ వినియోగాన్ని తప్పనిసరి అలవాటుగా మార్చుకోవాలి. మలుపు పూర్తయిన తర్వాత దాన్ని ఆపేయడం కూడా అంతే ముఖ్యం. పొరపాటున ఇండికేటర్ వెలుగుతూనే ఉంటే వెనుక వచ్చే వాహనదారులకు తప్పుడు సంకేతాలు వెళ్లే ప్రమాదం ఉంది.

#### నిబంధనలు ఉన్నా.. అమలులో నిర్లక్ష్యం ఎందుకు?

మోటారు వాహనాల చట్టంలో అనవసర హారన్ల వినియోగం, నిబంధనలకు విరుద్ధంగా శబ్ద పరికరాల్లో మార్పులు చేయడం వంటి ఉల్లంఘనలపై చర్యలకు అవకాశం ఉంది. సెక్షన్ 194ఎఫ్ ప్రకారం సంబంధిత ఉల్లంఘనలకు జరిమానాలు విధించవచ్చు. అలాగే వాహనాన్ని మళ్లించే ముందు అవసరమైన సంకేతాలు ఇవ్వకపోవడం వంటి చర్యలకు సెక్షన్ 177తోపాటు వర్తించే ఇతర నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అయితే చట్టాలు ఉన్నంత మాత్రాన సమస్య పరిష్కారం కాదు. వాటిని సమర్థంగా అమలు చేయడంతోపాటు వాహనదారుల్లో అవగాహన పెంచడం అత్యవసరం. ట్రాఫిక్ పోలీసులు కేవలం చలాన్లు విధించడానికే పరిమితం కాకుండా నిబంధనల ప్రాధాన్యాన్ని వివరించే కార్యక్రమాలు నిర్వహించాలి. వాహనాల తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధమైన అధిక శబ్ద హారన్లను గుర్తించి చర్యలు తీసుకోవాలి. రహదారి ఏ ఒక్కరి సొత్తు కాదు. వాహనదారులు, పాదచారులు, సైకిల్‌పై వెళ్లేవారు, ప్రజా రవాణాను వినియోగించేవారు.. అందరికీ దానిపై సమాన హక్కు ఉంది. ఒకరి నిర్లక్ష్యం మరొకరి ప్రాణాలకు ముప్పుగా మారకూడదు. ముఖ్యంగా వాహనం నడిపేటప్పుడు సహనం అత్యంత అవసరం. ముందు వాహనం నెమ్మదిగా వెళ్తున్నా పరిస్థితిని అర్థం చేసుకోవాలి. ట్రాఫిక్ సిగ్నల్ వద్ద కొన్ని క్షణాలు వేచి ఉండాల్సి వచ్చినా అసహనం ప్రదర్శించకూడదు. అనవసర హారన్లతో ఇతరులను ఇబ్బంది పెట్టకుండా, సరైన సమయంలో ఇండికేటర్లు ఉపయోగిస్తూ, నిర్ణీత వేగ పరిమితులను పాటిస్తూ ప్రయాణించాలి. వాహనం మరమ్మతులకు గురైనప్పుడు పరిస్థితికి అనుగుణంగా ప్రమాద హెచ్చరిక దీపాలను ఉపయోగించి, సాధ్యమైనంత త్వరగా సురక్షిత ప్రదేశానికి తరలించాలి. హారన్ మోగించడం వల్ల ముందున్న వాహనం వేగంగా కదలకపోవచ్చు. కానీ ఆ శబ్దం కారణంగా ఇతరులు అసహనానికి, ఆందోళనకు గురయ్యే అవకాశం ఉంది. ఇండికేటర్ వేయకుండా మలుపు తిరిగితే కొన్ని క్షణాల సమయం ఆదా కావచ్చేమో కానీ ప్రమాదం జరిగితే దాని మూల్యం ఎంతో భారీగా ఉంటుంది. అందుకే ట్రాఫిక్ నిబంధనలను జరిమానాల నుంచి తప్పించుకునే మార్గంగా కాకుండా ప్రాణాలను కాపాడే రక్షణ కవచంగా భావించాలి. రహదారిపై మనం చూపించే సహనం, క్రమశిక్షణ, బాధ్యతాయుత ప్రవర్తనే నాగరిక సమాజానికి అసలైన గుర్తింపు. హారన్ మోత తగ్గాలి.. రహదారులపై బాధ్యత పెరగాలి. జరిమానా పడకముందే మన ప్రవర్తన మారాలి. అప్పుడే రోడ్డు ప్రయాణం అందరికీ సురక్షితంగా, ప్రశాంతంగా మారుతుంది.

# ఎన్నికల కోసం విద్యార్థుల పోరు

### జామియాలో ఉద్రిక్తత!

- విద్యార్థి సంఘం పునరుద్ధరణ కోసం ఆమరణ నిరాహార దీక్షలు
- నిరసన టెంట్ల తొలగింపు ప్రయత్నంతో భద్రతా సిబ్బందితో ఘర్షణ
- 2006 నుంచి నిలిచిపోయిన విద్యార్థి సంఘం ఎన్నికలు
- క్యాంపస్‌లోకి ప్రవేశించిన కాంగ్రెస్ ఎంపీలపై రిజిస్ట్రార్ ఆరోపణలు
- గోడలపై వివాదాస్పద నినాదాలు.. విచారణకు బీజేపీ డిమాండ్
- ఉద్రిక్త పరిస్థితులతో తరగతుల నిర్వహణ ఆన్‌లైన్‌కు మార్పు




**న్యూఢిల్లీ, అక్టోబర్ 24 (ఉద్యమ కెరటం):** దేశ రాజధాని ఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయంలో విద్యార్థి సంఘం ఎన్నికల కోసం చేపట్టిన ఆందోళనలు ఉద్రిక్తతకు దారితీశాయి. విద్యార్థి సంఘాన్ని పునరుద్ధరించి వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఆమరణ నిరాహార దీక్షలకు దిగారు. శనివారం నిరసన టెంట్లను తొలగించేందుకు భద్రతా సిబ్బంది ప్రయత్నించడంతో విద్యార్థులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట, ఘర్షణ చోటుచేసుకోవడంతో క్యాంపస్‌లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయంలో 2006లో జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో విద్యార్థి సంఘాన్ని రద్దు చేశారు. అప్పటి నుంచి విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించడం లేదు. విద్యార్థులకు ప్రజాస్వామ్యబద్ధమైన ప్రాతినిధ్యం కల్పించాలని, సంఘాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 12 నుంచి విద్యార్థులు నిరసనలు కొనసాగిస్తున్నారు. తమ డిమాండ్లను నెరవేర్చే వరకు ఆందోళన విరమించేది లేదని నిరసనకారులు స్పష్టం చేస్తున్నారు. శుక్రవారం కాంగ్రెస్ ఎంపీలు ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ, ఇమ్రాన్ మసూద్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలోకి గోడ దూకి ప్రవేశించారన్న ఘటన వివాదాస్పదమైంది. ఈ విషయంపై జామియా రిజిస్ట్రార్ మహతాబ్ ఆలం రిజ్వీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇద్దరు కాంగ్రెస్ నాయకులు క్యాంపస్‌లోకి ప్రవేశించి విద్యార్థులను రెచ్చగొట్టారని, రాజకీయ ప్రయోజనాల కోసం వారిని ఉపయోగించుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఈ ఘటనపై ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. మరోవైపు విశ్వవిద్యాలయ గోడలపై జమ్మూకశ్మీర్‌కు సంబంధించిన వివాదాస్పద నినాదాలు కనిపించడం రాజకీయ చర్చకు దారితీసింది. వాటిని దేశ వ్యతిరేక నినాదాలుగా పేర్కొన్న బీజేపీ, ఘటనపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేసింది. నినాదాలు ఎవరు రాశారనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. విద్యార్థుల నిరసనలు, భద్రతా సిబ్బందితో ఘర్షణ నేపథ్యంలో క్యాంపస్‌లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఈ పరిణామాల దృష్ట్యా తరగతుల నిర్వహణను ఆన్‌లైన్ విధానానికి మార్చినట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ వెల్లడించారు. విద్యార్థి సంఘం ఎన్నికల నిర్వహణపై యాజమాన్యం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

# ఆపరేషన్ సిందూర్.. ట్రంప్ నోట మళ్లీ అదే పాట!

- భారత్-పాక్ యుద్ధాన్ని తానే ఆపానంటూ మరోసారి ప్రకటన
- ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది యుద్ధాలను నిలువరించానని వ్యాఖ్యలు
- ఐక్యరాజ్యసమితి సహకారం లేకుండానే శాంతి నెలకొల్పానని వెల్లడి
- నోబెల్ శాంతి బహుమతి రాకపోవడంపై అసంతృప్తి
- అమెరికా మధ్యవర్తిత్వం లేదని ఇప్పటికే స్పష్టం చేసిన భారత్



**వాషింగ్టన్, అక్టోబర్ 24 (ఉద్యమ కెరటం):** భారత్, పాకిస్థాన్ మధ్య సైనిక ఘర్షణను తానే నిలువరించానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వ్యాఖ్యానించారు. అమెరికా మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో ఫ్లోరిడాలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో మాట్లాడిన ఆయన 'ఆపరేషన్ సిందూర్' అంశాన్ని ప్రస్తావించారు. అణ్వాయుధాలు కలిగిన భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తన దౌత్య ప్రయత్నాలతో ఆపినట్లు మరోసారి చెప్పుకొచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది యుద్ధాలను నిలువరించానని, ఇందుకోసం ఐక్యరాజ్యసమితికి ఒక్క ఫోన్ కూడా చేయాల్సిన అవసరం రాలేదని పేర్కొన్నారు. ఇన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ తనకు నోబెల్ శాంతి బహుమతి దక్కలేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు.

#### మధ్యవర్తిత్వ వాదనను ఖండించిన భారత్

2025 ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా అదే ఏడాది మే నెలలో పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై భారత్ 'ఆపరేషన్ సిందూర్' పేరుతో దాడులు నిర్వహించింది. అనంతరం ఇరు దేశాల మధ్య సైనిక ఉద్రిక్తతలు నెలకొన్నాయి. అయితే ఈ ఘర్షణను నిలువరించడంలో అమెరికా మధ్యవర్తిత్వం లేదని భారత ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసింది. పాకిస్థాన్ అభ్యర్థన మేరకు ఇరు దేశాల సైనిక ఉన్నతాధికారుల మధ్య జరిగిన ప్రత్యక్ష చర్చల అనంతరమే సైనిక చర్యలను నిలిపివేసినట్లు వెల్లడించింది. అయినప్పటికీ ట్రంప్ మాత్రం భారత్, పాకిస్థాన్ మధ్య ఘర్షణను తానే ఆపానన్న వాదనను పునరావృతం చేస్తున్నారు. ఆయన తాజా వ్యాఖ్యలతో అమెరికా మధ్యవర్తిత్వంపై మరోసారి చర్చ మొదలైంది.



# ర్యాలీ వాయిదా వేయండి

### రూ.10 వేల కోట్ల నష్టం తప్పించండి!

### రాహుల్ గాంధీకి ఢిల్లీ వ్యాపార సంఘాల విజ్ఞప్తి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 24 (ఉద్యమ కెరటం):** నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ సహా ఇండియా బ్లాక్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టనున్న సంగతి తెలిసిందే. అయితే, దీపావళిని దృష్టిలో ఉంచుకుని ఈ ర్యాలీని వాయిదా వేసుకోవాలని ద ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) కోరింది. లేకపోతే రూ.10,000 కోట్ల వరకు నష్టం వాటిల్లుతుందని వివరించింది. ఈ మేరకు సీటీఐ ఛైర్మన్ బ్రిజేష్ గోయల్ రాహుల్ గాంధీని కోరారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోరుతూ ఇండియా బ్లాక్ ఆధ్వర్యంలో రాంలీలా మైదానంలో ర్యాలీ జరగనుంది. ఈ ర్యాలీ సందర్భంగా ఆ రోజు వ్యాపార సంస్థలు అన్నీ మూసేయాల్సి ఉంటుంది. అలాగే, ముందు నుంచే అక్కడ పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలి. దీంతో ర్యాలీకి కొద్ది రోజుల ముందునుంచే వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు ఆటంకం కలుగుతుంది. ఈ నేపథ్యంలో సీటీఐ తరఫున ఆ సంస్థ ఛైర్మన్ బ్రిజేష్ గోయల్.. రాహుల్ గాంధీకి లేఖ రాశారు. ఆయన లేఖలో పేర్కొన్న వివరాల ప్రకారం.. దీపావళి, ధంతేరాస్ సందర్భంగా ఈ ప్రాంతంలో రూ.25,000 కోట్ల వ్యాపారం జరుగుతుంది. బంగారం, వెండితోపాటు ఎలక్ట్రానిక్స్, దుస్తులు, వంట సామగ్రి, డ్రైఫ్రూట్స్, స్వీట్స్, వాహనాలు, ఆస్తుల కొనుగోలు, గిఫ్ట్ ఐటమ్స్ వంటివి భారీ స్థాయిలో అమ్ముడుపోతాయి. అయితే, ఇండియా బ్లాక్ ర్యాలీ వల్ల ఈ వ్యాపారాలకు ఆటంకం కలుగుతుంది. దీనివల్ల రూ.10,000 కోట్ల నష్టం వాటిల్లే అవకాశం ఉంది. నవంబర్ 6న ధంతేరాస్, 8న దీపావళి, 10న భాయ్ దూజ్ వంటి పండుగలున్నాయి. అందువల్ల నవంబర్ 10 వరకు ఈ ర్యాలీని వాయిదా వేసుకోవాల్సిందిగా సూచించారు. పండుగలకు వారం రోజుల ముందు నుంచి వ్యాపారం ఉధృతంగా సాగుతుందన్నారు. ఇప్పటికే అక్టోబర్‌లో సాగిన అనేక ర్యాలీల వల్ల తీవ్రంగా నష్టపోయామన్నారు. రోడ్లు బ్లాక్ చేయడం, రవాణా సదుపాయం లేకపోవడం, ప్రభుత్వ ఆంక్షల వల్ల ఇబ్బందులు పడుతున్నామన్నారు. అందువల్ల తమ విన్నపాన్ని దృష్టిలో ఉంచుకుని నవంబర్ 10 వరకు ర్యాలీని వాయిదా వేసుకోవాలని, ఆ తర్వాతే ర్యాలీ నిర్వహించుకోవాలని సూచించారు.

# ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

### పార్కింగ్ బే వద్దకు ఫ్లైట్




**న్యూఢిల్లీ:** ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. టేకాఫ్‌కు ముందు ఫ్లైట్ టాయిలెట్‌లో ఈ బెదరింపు సందేశాన్ని సిబ్బంది గుర్తించారు. ఈ నేపథ్యంలో ఆ విమానం పార్కింగ్ బే వద్దకు తిరిగి చేరుకున్నది. ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఐజీఐ)లో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం 3.15 గంటలకు ఇండిగో విమానం 6ఈ 6091, ఢిల్లీ నుంచి చెన్నైకు బయలుదేరాల్సి ఉన్నది. అయితే టేకాఫ్‌కు సిద్ధమవుతున్న సమయంలో ఆ విమానం వెనుక భాగంలోని టాయిలెట్‌లో ఒక 'హెచ్చరిక' నోట్ లభించింది. ఆ విమానాన్ని చెన్నైకి ప్రయాణం కొనసాగించవద్దని హెచ్చరించినట్లుగా అందులో ఉన్నది. కాగా, ఈ బెదిరింపు సందేశాన్ని విమాన సిబ్బంది గుర్తించారు. దీంతో సంబంధిత నిబంధనల ప్రకారం విమానం టేకాఫ్‌ను రద్దు చేశారు. దానిని తిరిగి బేకి తీసుకువచ్చారు. అవసరమైన ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని (ఎస్‌వోపీ) పూర్తి చేశారు. ఆ బెదిరింపు నోట్ బూటకమని తేలింది. ఈ నేపథ్యంలో సుమారు 2గంటలు ఆలస్యంగా శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయంలో విమానం టేకాఫ్ అయ్యింది. రాత్రి 7.40 గంటలకు చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో అది సురక్షితంగా ల్యాండ్ అయ్యిందని ఇండిగో అధికారి తెలిపారు.



# అన్ని వృత్తులలో వైద్య వృత్తి గొప్పది

**జిల్లా కలెక్టర్ కే హరిత**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** అన్ని వృత్తులలో ప్రాణాలు కాపాడే వైద్య వృత్తి చాలా గొప్పదని జిల్లా కలెక్టర్ కే హరిత అన్నారు. శనివారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం అంకుశపూర్ లో గల ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్య విద్య ప్రథమ సంవత్సర విద్యార్థులకు వైట్ కోర్టు శర్మని కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని వృత్తులలో ప్రాణాలు కాపాడే వైద్య వృత్తి చాలా గొప్పదని తెలిపారు. వైద్యం అంటే కేవలం మందులు, చికిత్స మాత్రమే కాదని, రోగికి భరోసా ఇచ్చేవారే వైద్యులు అని తెలిపారు. వైద్య వృత్తి చాలా కఠినమైన పరీక్షలతో కూడుకుందని, దేశ వ్యాప్తంగా నిర్వహించే నీట్ పరీక్షలు ఉత్తమ ప్రతిభ కనబరిచి, విజయం సాధించి వైద్య విద్య సీటు సంపాదించడం చాలా గొప్ప విషయమని తెలిపారు. తన తండ్రి కూడా వైద్య వృత్తిలో ఉన్నప్పుడు రోగుల పట్ల చూపిన ఓర్పు, ఆయన మరణించిన తర్వాత కూడా ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు. ఒక వైద్యుడిగా మాట్లాడే మాటలు, చూపించే స్పర్శ, ప్రవర్తన కూడా రోగులకు భరోసా ఇస్తుందని తెలిపారు. వైద్య విద్యార్థులు, ప్రొఫెసర్లు చెప్పే ప్రతి అంశాన్ని శ్రద్ధగా విని, భవిష్యత్తులో మంచి వైద్యులుగా కీర్తి ప్రతిష్టలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ వెంకట్, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు



# రేపు విద్యాసంస్థలకు సెలవు



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** కుమ్రంభీమ్ 86వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీ సోమవారం రెసిడెన్షియల్ పాఠశాలలు మినహా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు స్థానిక సెలవు ప్రకటించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కే హరిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న సెలవుకు బదులుగా నవంబర్ 14వ తేదీ 2వ శనివారం అన్ని పాఠశాలలు పని దినాలు పాటిస్తాయని తెలిపారు.

**ప్రజావాణి రద్దు:** కుమ్రంభీమ్ వర్ధంతిని పురస్కరించుకుని 26వ తేదీ సోమవారం ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని కలెక్టర్ హరిత ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని, దరఖాస్తుదారులు మీ సేతు యాప్ ద్వారా తమ దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు.

### రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో వైద్యం అందించి

# ప్రాణాలు కాపాడాలి

**హైదరాబాద్, అక్టోబర్ 25 :** రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు ప్రమాదం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్‌లో వైద్య చికిత్స అందించి ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రాహత్ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా సమర్థవంతంగా అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుండి రోడ్డు ప్రమాద బాధితుల చికిత్స పథకం అమలుపై రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కరీంనగర్ కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ, ప్రమాద బాధితులను చికిత్స ఖర్చుల గురించి ఆలోచించకుండా సమీపంలోని ప్రభుత్వ లేదా పథకం పరిధిలోని ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి అత్యవసర వైద్య సేవలు అందించాలని తెలిపారు. పీఎం రాహత్ పథకం కింద అర్హులైన ప్రతి బాధితుడికి రూ.1.50 లక్షల వరకు చికిత్స ఖర్చును నిబంధనల ప్రకారం కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని పేర్కొన్నారు. జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులన్నీ సంబంధిత పోర్టల్‌లో తక్షణమే నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ప్రమాద కేసులను నేషనల్ హెల్త్ అథారిటీ టీఎంఎస్ 2.0 పోర్టల్‌తో పాటు ఈ-డీఏఆర్ (వణూ=) పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సీఎస్ స్పష్టం చేశారు. ప్రమాదం జరిగిన 24 గంటల్లోపు ఆసుపత్రుల నుంచి వచ్చే ధ్రువీకరణ అభ్యర్థనలను పోలీసు అధికారులు పరిశీలించి ఆమోదించాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఈ ప్రక్రియ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించాలని, జిల్లాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి మ్యాపింగ్ చేయాలని సూచించారు. ఆరోగ్య, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, ప్రజల్లో అవగాహన కోసం నెక్స్ట్‌జెన్ ఎం-పరివాహన్ యాప్ వినియోగాన్ని ప్రోత్సహించాలని తెలిపారు.



# హక్కుల కోసమే పోరాటం.. ఎవరి భిక్షా కాదు

- మంత్రి సీతక్క స్పష్టీకరణ
- నిజాలను నిగ్గు తేల్చడమే పత్రికారంగ ప్రాథమిక కర్తవ్యం: జస్టిస్ జీ రాధారాణి
- డెస్క్‌లకే పరిమితం కాక.. ఫీల్డ్ రిపోర్టింగ్‌లో నిర్భయంగా ముందడుగు వేయాలి: సీపీ సుమతి
- మహిళా జర్నలిస్టుల ఐక్య పోరాటానికి హైదరాబాద్ సదస్సు వేదిక




**ఉద్యమ కెరటం, హైదరాబాద్ బ్యూరో:** మేము రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసమే పోరాడుతున్నాం తప్ప, ఎవరి భిక్షనూ కోరడం లేదు. చేతిలో మైక్ పట్టుకుని ప్రశ్నించే మహిళ శత్రువు కాదు.. సమాజ హితం కోరే పాత్రికేయుల గొంతుకలను ఎవరూ అణచివేయలేరు అని రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) తేల్చిచెప్పారు. ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ), మీడియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఇండియా (మేఫీ), తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజా హోటల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సు శనివారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వందలాది మంది మహిళా పాత్రికేయులు హాజరైన ఈ సదస్సు, మహిళా జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు, ఐక్య పోరాటానికి వేదికగా నిలిచింది.

**నిజాలను నిగ్గుతేల్చడమే పత్రికారంగ ప్రాథమిక కర్తవ్యం: జస్టిస్ రాధారాణి**

సమాజంలో అసత్యాలను చీల్చి, వాస్తవాలను బయటకు తీయడమే జర్నలిజం ముఖ్య ఉద్దేశమని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షురాలు జస్టిస్ జి. రాధారాణి స్పష్టం చేశారు. ఆర్టికల్ 19(1)(a) స్వేచ్ఛను ఇస్తే, ఆర్టికల్ 19(2) బాధ్యతను గుర్తు చేస్తుందన్నారు. ఏఐ, డీప్‌ఫేక్ యుగంలో విశ్వసనీయత కాపాడుకోవడానికి 'ఫ్యాక్ట్ చెకింగ్' అత్యంత అవసరమని సూచించారు. ప్రతీ మీడియా సంస్థ ఉపాధి ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టాన్ని (పోష్ చట్టం) పక్కాగా అమలు చేయాలని పిలుపునిచ్చారు.

**ఫీల్డ్ రిపోర్టింగ్‌లో నిర్భయంగా ముందడుగు వేయాలి: సీపీ సుమతి**

మహిళా జర్నలిస్టులు కేవలం ఆఫీసు డెస్క్‌లకే పరిమితం కాకూడదని, క్షేత్రస్థాయిలో సవాళ్లను ఎదుర్కొంటూ ఫీల్డ్ రిపోర్టింగ్‌లో ముందుండాలని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి ఆకాంక్షించారు. ప్రతీ సమస్యను సమగ్రంగా విశ్లేషించే శక్తి మహిళలకు ఉందన్నారు. అలాగే, కర్ణాటక మీడియా అకాడమీ చైర్‌పర్సన్ ఆయేషా ఖానమ్ మాట్లాడుతూ న్యూస్‌రూమ్‌లలో మహిళలు తమ ప్రతిభను చాటుకుంటూ, మానవీయ కోణంతో కూడిన కథనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.



**విధి నిర్వహణలో దాడులను సహించేది లేదు**

విధుల నిర్వహణలో మహిళా జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, సోషల్ మీడియా వేదికగా సాగుతున్న వ్యక్తిత్వ హననాన్ని నేతలు తీవ్రంగా ఖండించారు. ఇటీవల రీతిక చోప్రా వంటి జర్నలిస్టులు చూపిన ధైర్యాన్ని ఐజేయూ అధ్యక్షుడు బల్విందర్ సింగ్ జమ్ము ప్రశంసించారు. ఈ సదస్సులో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, ఐజేయూ నేతలు డి.అమర్, ఎస్.ఎన్.సిన్హా, డి.సోమసుందర్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రామనారాయణ, సీనియర్ జర్నలిస్టులు స్వప్న, రాజేశ్వరి కళ్యాణం, అత్తలూరి అరుణ తదితరులు పాల్గొన్నారు.

# మానకొండూర్ ఆర్ఐ అవినీతి లీలలు!

- కార్యాలయంలో పైరవీకారులకే పెద్ద పీట
- చెంజర్ల భూ రికార్డులు ట్యాంపరింగ్?
- డబ్బులు ఇస్తే..పట్టా లేని వారికి భూమి!



**ఉద్యమ కెరటం, కరీంనగర్:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల రెవెన్యూ వ్యవస్థ అవినీతి మయమైంది.రైతులకు న్యాయం చేయాల్సిన రెవెన్యూ ఇన్ స్పెక్టర్(ఆర్ఐ)అక్రమాలకు కేంద్ర బిందువుగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.గత కొంత కాలంగా మానకొండూర్ ఆర్ఐ మేడం తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.కార్యాలయంలో సామాన్య రైతులకు ప్రాధాన్యతనివ్వకుండా కేవలం పైరవీకారులకు,దళారులకు మాత్రమే పెద్ద పీట వేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.రైతులు తమ భూ సమస్యలతో వెళ్తే పట్టించుకోకుండా,పైరవీకారుల ద్వారా వస్తే డబ్బులు తీసుకుని పనులు చేస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

**భూ రికార్డులతో చెలగాటం..**

డబ్బులు ఇస్తే చాలు ఆర్ఐ ఏ రికార్డునైనా మార్చేస్తున్నారనే ఆరోపణలు సంచలనం రేపుతున్నాయి.అటు తహసీల్దార్ సార్ ఆదేశాలను పట్టించుకోకుండా,ఇటు కింద స్థాయి జిపిఓను ఖాతరు చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మానకొండూర్ మండలం చెంజర్ల రెవెన్యూ గ్రామం పరిధిలోని ఓ సర్వే నెంబర్లో అసలు మొఖాపై భూమే లేని ఓ ఇద్దరు వ్యక్తుల పేర్లపై ఒకరి పేరున 20 గుంటలు,మరొకరి పేరున 10 గుంటల భూమిని ఆర్ఐ అక్రమంగా రికార్డుల్లో నమోదు చేశారు.భూమి నమోదు కోసం ఆర్ఐ పైరవీకారుల నుండి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.అంతే కాకుండా మరి కొందరు వ్యక్తులపై కూడా భూమి అక్రమంగా రికార్డుల్లో నమోదు చేసేందుకు పైరవీకారులతో చేతులు కలిపినట్లు సమాచారం.అదే సర్వే నెంబర్లో భూమిని అక్రమంగా నమోదు చేసేందుకు సదరు ఆర్ఐ మేడం ఫైల్ ను సిద్ధం చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.సర్వే నెంబర్లో ఉన్న పట్టాదారులకు అన్యాయం జరిగేలా ఆర్ఐ వ్యవహరిస్తూ మోకాపై భూమి లేని ఇతరుల పేర్లను నమోదు చేయిస్తూ,అసలైన రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారు.భూ భారతి రికార్డుల్లో పేర్లు నమోదు చేయడం,మార్చడం కోసం రేటు ఫిక్స్ చేసి వసూళ్లకు పాల్పడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

**జిల్లా అధికారులు ఏం చేస్తున్నారు?**

మండలంలో ఇంత అవినీతి యథేచ్ఛగా జరుగుతున్నా జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.తక్షణమే కలెక్టర్,ఆర్డీఓ,జిల్లా రెవెన్యూ అధికారులు మానకొండూర్ ఆర్ఐ అవినీతి,అక్రమాలపై విచారణ జరిపి,రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అవినీతికి పాల్పడుతున్న ఆర్ఐ మేడంపై కఠిన చర్యలు తీసుకుని,సస్పెండ్ చేయాలని,ఆమె హయాంలో జరిగిన అన్ని భూ మార్పిడులపై విచారణ జరిపి అక్రమంగా నమోదైన పేర్లను తొలగించాలని రైతులు కోరుతున్నారు.







## మహిళా జర్నలిస్టుల హక్కుల వేదికగా

# హైదరాబాద్ జాతీయ సదస్సు!







ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ), మీడియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఇండియా (మేఫీ), తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) సంయుక్త ఆధ్వర్యంలో భాగ్యనగరంలో రెండు రోజుల మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సు వైభవంగా ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన వందలాది మంది మహిళా పాత్రికేయులు ఈ వేదికగా తమ హక్కుల పరిరక్షణకు, ఐక్య పోరాటానికి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ.. తాము రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసమే పోరాడుతున్నామని, చేతిలో మైక్ పట్టుకుని ప్రశ్నించే మహిళ ఎప్పటికీ శత్రువు కాదని తేల్చిచెప్పారు. అనంతరం హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జి. రాధారాణి మాట్లాడుతూ, జర్నలిజంలో విశ్వసనీయతను కాపాడుకోవడానికి ప్రతీ సమాచారాన్ని ఫ్యాక్ట్ చెకింగ్ చేసుకోవాలని, ప్రతీ మీడియా సంస్థలో పోష్ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని కోరారు. మల్కాజ్‌గిరి సీపీ సుమతి, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి సహా పలువురు ప్రముఖ పాత్రికేయ నేతలు ఈ సదస్సులో పాల్గొని తమ సందేశాలను అందించారు.

- ఉద్యమ కెరటం, హైదరాబాద్ బ్యూరో





















# జవహర్ నగర్ అభివృద్ధికి రూ.35 కోట్లు

- మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలిపిన కాంగ్రెస్ నేతలు

**ఉద్యమ కెరటం, జవహర్ నగర్:** జవహర్ నగర్ డివిజన్ పరిధిలో 115 అభివృద్ధి పనుల సీసీ రోడ్లు, యుజిడి కోసం రూ.35 కోట్ల నిధులను మంజూరు చేయించిన ఐటీ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు జవహర్ నగర్ కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. జవహర్ నగర్ డివిజన్ అభివృద్ధికి రూ.35 కోట్ల నిధుల మంజూరు కోసం కృషి చేసిన మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శనివారం జవహర్ నగర్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జవహర్ నగర్ మాజీ మేయర్, జవహర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ మాట్లాడుతూ జవహర్ నగర్ అభివృద్ధి పట్ల మంత్రి శ్రీధర్ బాబు, జిల్లా అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ చూపిస్తున్న చొరవ అభినందనీయమని కొనియాడారు. ఈ నిధులతో డివిజన్ లో పెండింగ్ లో ఉన్న రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి తదితర మౌళిక వసతుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శులు గజ్వేల్ శంకర్, డీఎస్ఎస్ వెంకటేశ్వర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# నీటి సంరక్షణే లక్ష్యం



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** మండల కేంద్రంలోని జవాహర్ నగర్ కాలనీలో తరచూ మరమ్మతులకు గురవుతున్న గ్రామ పంచాయతీ బోరు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని గుడిహత్నూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆడె శీల స్పష్టం చేశారు. శనివారం కాలనీలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. నిరంతరం ఇబ్బంది పెడుతున్న పాత బోరును తొలగించి, దాని స్థానంలో త్వరగతిన కొత్త బోరింగ్ ఏర్పాటు చేయిస్తానని కాలనీ వాసులకు భరోసా ఇచ్చారు. రాబోయే రోజుల్లో ఎల్నినో ప్రభావంతో ఏర్పడే కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రతిఒక్కరూ నీటిని, విద్యుత్ను వృథా చేయకుండా పొదుపుగా వాడాలని పిలుపునిచ్చారు. మరోవైపు రాజీవ్ నగర్ కాలనీలో దెబ్బతిన్న పైప్లైన్ లీకేజీ సమస్యలపై తక్షణమే స్పందించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది విజయ్తో మరమ్మతులు చేయించి నీటి వృధాను అరికట్టారు. ప్రజల సమస్యలపై తక్షణమే స్పందిస్తూ నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్న సర్పంచ్ చొరవపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు నీటి గుంతల ఏర్పాటు



**ఉద్యమ కెరటం, జైనూర్:** వన్యప్రాణులకు తాగునీటి సౌకర్యం కల్పించే లక్ష్యంతో జైనూర్ మండలం పవర్గూడ గ్రామపంచాయతీ పరిధిలో నీటి గుంతల ఏర్పాటు పనులను సర్పంచ్ తొడసం రాజేందర్ శనివారం ప్రారంభించారు. వేసవి కాలంలో అడవుల్లో నీటి కొరత కారణంగా వన్యప్రాణులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అటవీ శాఖ ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టారు. దీంతో వన్యప్రాణులకు తాగునీరు అందుబాటులోకి రావడంతో పాటు, నీటి కోసం అవి జనావాస ప్రాంతాల వైపు రావడం తగ్గుతుందని అధికారులు తెలిపారు. వన్యప్రాణుల సంరక్షణతో పాటు అడవుల్లో వాటికి అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సర్పంచ్ రాజేందర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రాథోడ్ వందన, బీట్ ఆఫీసర్ అన్విత అన్నమల్, గ్రామస్తులు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



# దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి లక్ష్యం

- కోటి 40 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మెదక్ ఎంపీ

**ఉద్యమ కెరటం, దుబ్బాక ప్రతినిధి (రాయపోల్):** దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుదామని మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు సూచించారు. శనివారం రాయపోల్ మండలంలోని ఎల్కల్ అంకిరెడ్డిపల్లి, వడ్డేపల్లి, కొత్తపల్లి, ఆరేపల్లి, కృష్ణ సాగర్, గ్రామాలలో సీసీ రోడ్లు, వివో భవనాలు, డ్రైనేజీలకు శంకుస్థాపనలు భూమి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ భారత ప్రభుత్వం నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం కోటి 40 లక్షల రూపాయలతో నిర్మించినటువంటి పనులకు శిలాఫలకాలు వేయడం జరుగుతున్న పనులకు పూర్తిచేయాలని సర్పంచ్లను ఆదేశించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే, ప్రభుత్వంతో సంబంధం లేకుండా దుబ్బాక నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి కేంద్రం నుండి నిధులు తీసుకు రావడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. గతంలో దుబ్బాక ఎమ్మెల్యేగా పనిచేసినప్పుడు దుబ్బాకకు జాతీయస్థాయిలో గుర్తింపు దక్కిందని పేర్కొన్నారు. ప్రస్తుతం మెదక్ పార్లమెంట్ పరిధిలో ఉన్నటువంటి ఏడు నియోజకవర్గాలకు ఎమ్మెల్యేలతో పార్టీలతో సంబంధం లేకుండా అన్ని నియోజకవర్గాలకు సమన్యాయం చేస్తానని తెలిపారు. గ్రామాల సర్పంచులు గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# పోక్సో, ఇతర చట్టాలపై విద్యార్థులకు అవగాహన

- పిల్లల భద్రతపై ప్రత్యేక సెమినార్ నిర్వహించిన మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ

**ఉద్యమ కెరటం, దమ్మపేట:** విద్యార్థులకు పోక్సో చట్టం, ఇతర చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు, ఆపద సమయాల్లో తమను తాము ఎలా రక్షించుకోవాలో తెలియజేసేందుకు దమ్మపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో, చైర్మన్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బి భవాని నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి నిర్వహించిన సదస్సులో పోక్సో చట్టం, బాలల హక్కులు, పిల్లలపై జరిగే నేరాలు, వాటి నుంచి రక్షణ పొందే మార్గాల గురించి వివరించారు. ఈ సందర్భంగా జడ్జి బి భవాని మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో ధైర్యంగా ఉండాలని, ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా భయపడకుండా వాటిని ఎదుర్కోవాలని సూచించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, వేధింపులకు గురి చేసినా ఆ విషయాన్ని దాచి పెట్టకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు తెలియజేయాలని చెప్పారు. అవసరమైన సమయంలో సంబంధిత హెల్ప్లైన్ సేవలను వినియోగించుకొని ఫిర్యాదు చేయాలని సూచించారు. పిల్లలపై వేధింపులకు పాల్పడే వ్యక్తులు ఎవరైనా సరే, వారి గురించి భయంతో మౌనంగా ఉండకూడదని, నమ్మకమైన పెద్దల సహాయం తీసుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. చట్టపరమైన రక్షణ, న్యాయ సహాయం పొందే విధానాలపై కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట, దమ్మపేట పోలీస్ శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. దమ్మపేట ఎస్ఐ బి రాజేష్, ఎంఈఓ జగపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి, ఉపాధ్యాయులు అత్తిలి శ్రీనివాసరావు, దమ్మపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొంది మురళీమోహన్, ప్రధాన కార్యదర్శి లక్కినేని నరేంద్రబాబు, ఉపాధ్యక్షుడు ముప్పిడి శ్యామ్ సుధాకర్, గోళ్ళ భవానీ కృష్ణ యాదవ్, తామ బాలరాజు, మహిళా న్యాయవాది కాలం సంధ్యారాణి, కోర్టు సిబ్బంది, లీగల్ సర్వీసెస్ అథారిటీ సిబ్బంది రాజ్కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ముంచుకొస్తున్న కరువు ముప్పుపై ముందస్తు ప్రణాళిక అవసరం

- కరువు నివారణలో ప్రజలు భాగస్వాములు కావాలి
- ఎల్నినో ప్రభావంపై రైతులను అప్రమత్తం చేయాలి
- ఇల్లంతకుంట మండల పరిషత్ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

**ఉద్యమ కెరటం, మానకొండూర్ ప్రతినిధి :** కరోనా అనంతరం ఎల్నినో ప్రభావంతో ముంచుకొస్తున్న కరువు ముప్పును ఎదుర్కొనేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో ఎదురయ్యే కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శనివారం ఇల్లంతకుంట మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రత్యేక అధికారి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన అభివృద్ధి సమీక్ష సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్నినో ప్రభావ తీవ్రంగా ఉండే అవకాశాలున్నాయని, దీంతో కరువు పరిస్థితులు తీవ్రమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి విపత్కర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రజలు ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని అధిక నీరు అవసరమయ్యే వరి పంటకు బదులుగా ఆరుతడి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామసభలు నిర్వహించి, ఎల్నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులు, వ్యవసాయ రంగంపై పడే ప్రభావం గురించి రైతులకు వివరించాలని ఆదేశించారు. పంటల ఎంపిక, సాగు విధానాల విషయంలో రైతులకు తగిన అవగాహన కల్పించాలని సూచించారు. రానున్న రోజుల్లో పశువులు, పక్షులు సైతం నీటి కొరతతో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు తలెత్తవచ్చని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నీటిని వృథా చేయకుండా జాగ్రత్తగా వినియోగించుకోవడం అత్యంత అవసరమన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ వై. శశికళ, మండల తహసీల్దార్ సురేష్, ఇల్లంతకుంట ప్యాక్స్ చైర్మన్ ఊట్కూరి వెంకట రమణారెడ్డి, సర్పంచుల ఫోరం చైర్మన్ మామిడి రాజుతోపాటు వివిధ గ్రామాల సర్పంచులు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రపంచ శాంతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- ప్రపంచ మానవ హక్కుల సంస్థ జాతీయ డైరెక్టర్ మధుబాబు చికిలే

**ఉద్యమ కెరటం, కుత్బుల్లాపూర్ ప్రతినిధి:** ప్రపంచ శాంతి స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రపంచ మానవ హక్కుల సంస్థ జాతీయ డైరెక్టర్ మధుబాబు చికిలే పిలుపునిచ్చారు. ఐక్య రాజ్యసమితి 81వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రోడా మేస్త్రీనగర్ డివిజన్ పరిధిలోని మగ్దుమ్ నగర్లో ఉన్న నాగార్జున ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకలను పాఠశాల చైర్మన్ బోయినపల్లి కిషన్ రావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మధుబాబు చికిలే మాట్లాడుతూ.. ప్రపంచ శాంతి స్థాపన, యుద్ధాల నివారణ లక్ష్యాలతో ఐక్యరాజ్య సమితి ఏర్పాటైందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా శాంతిని నెలకొల్పడం, పేదరిక నిర్మూలన, ఆరోగ్య పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి వంటి లక్ష్యాల సాధనకు ఐక్య రాజ్యసమితి కృషి చేస్తోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కుల పరిరక్షణతో పాటు శాంతి, సౌభ్రాతృత్వం, పరస్పర సహకారాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. పాఠశాల చైర్మన్, కరస్పాండెంట్ బోయినపల్లి కిషన్ రావు మాట్లాడుతూ.. తటస్థంగా వ్యవహరించాల్సిన ఐక్యరాజ్యసమితి కొన్ని సందర్భాల్లో ఒకవైపు మొగ్గు చూపడం వల్ల ప్రపంచ శాంతికి విఘాతం కలుగుతోందని అభిప్రాయపడ్డారు. అన్ని దేశాల పట్ల సమాన దృక్పథంతో వ్యవహరించినప్పుడే ప్రపంచవ్యాప్తంగా శాంతి స్థాపన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షుడు తూటే విజయ్ కుమార్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సుంకరి సాయిప్రతాప్, వెల్ఫేర్ సంస్థ ప్రతినిధి సందీప్ బల్లెం, శ్రీనివాస్ గౌడ్, అడ్వకేట్ శ్రీనివాస్, పాఠశాల డైరెక్టర్ నవీన్ కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.









# కరీంనగర్ మట్టిలో 'శనార్థి' సందడి..

## మొదలైన సినిమా షూటింగ్!

కరీంనగర్, అక్టోబర్ 24 : టాలీవుడ్‌లో పక్కా లోకల్, రా అండ్ రస్టిక్ కథలతో తనదైన ముద్ర వేసిన ప్రముఖ దర్శకుడు, నిర్మాత సంపత్ నంది మరో అదిరిపోయే ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. సోషల్ మీడియాలో విపరీతమైన ఫాలోయింగ్ ఉన్న 'రాజ్ వెడ్స్ రాంబాయ్' ఫేమ్ అఖిల్ రాజ్, 'ఫోక్ క్వీన్' నాగదుర్గలను హీరోహీరోయిన్లుగా పరిచయం చేస్తూ తెరకెక్కిస్తున్న సరికొత్త చిత్రం 'శనార్తి' రెగ్యులర్ షూటింగ్ కరీంనగర్ జిల్లాలో గ్రాండ్‌గా ప్రారంభమైంది. ఆదిత్య మూవీస్ సమర్పణలో సంపత్ నంది టీమ్ వర్క్స్, శ్రీ ధనలక్ష్మి ప్రొడక్షన్స్ బ్యానర్లపై కే.వి. శ్రీధర్ రెడ్డి, సంపత్ నంది సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కరీంనగర్ జిల్లా వెలిచాలలో డైరెక్టర్ సంపత్ నంది, ప్రొడ్యూసర్ శ్రీధర్ రెడ్డి సమక్షంలో ఈ సినిమా పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న గణేష్ రాజ్ ఉప్పునూటి స్వస్థలం కరీంనగర్ జిల్లాలోని గట్టు బూత్కూర్ కావడం విశేషం. ఒక యువ దర్శకుడు తన తొలి సినిమాను సొంత ఊరి వాతావరణంలోనే సుమారు నెల రోజుల పాటు చిత్రీకరిస్తున్నారు. తెలంగాణ సంప్రదాయాలు, మట్టి వాసనలను వెండితెరపైకి తీసుకురాబోతున్న ఈ చిత్రానికి సురేష్ బొబ్బిలి సంగీతం అందిస్తుండగా, విశ్వనాథ్ రెడ్డి సినిమాటోగ్రఫీ, బేబీ సురేష్ భీమగాని ఆర్ట్ డైరెక్షన్‌గా వ్యవహరిస్తున్నారు. మై విలేజ్ షో రాజు, మురళీధర్ గౌడ్, సునందిని, సుంకర లక్ష్మి, రమేష్ నకిరికంటి, వైవా రెడ్డి, అంజి బాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.



# ఎయిర్‌పోర్ట్‌లో చుట్టుముట్టి తాకారు

## నటి అనుపమ పరమేశ్వరన్ ఆవేదన!

హైదరాబాద్, అక్టోబర్ 24:

ప్రముఖ నటి అనుపమ పరమేశ్వరన్ తనకు ఎయిర్‌పోర్ట్‌లో ఎదురైన ఓ చేదు అనుభవాన్ని తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పంచుకున్నారు. కొందరు వ్యక్తులు తనను చుట్టుముట్టి, అనుమతి లేకుండా ఫొటోలు తీయడమే కాకుండా అసభ్యంగా తాకారంటూ ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను మానసికంగా ఎంతో ఇబ్బంది పెట్టిందని తెలిపారు. ఇటీవల ఓ ఎయిర్‌పోర్ట్‌లో లగేజీ కోసం ఒంటరిగా వేచి చూస్తున్న సమయంలో ఈ సంఘటన జరిగిందని అనుపమ వివరించారు. క్షణాల్లో జనం తనను చుట్టుముట్టి హద్దులు మీరారని, ఆ సమయంలో ఏం చేయాలో పాలుపోలేదని పేర్కొన్నారు. అభిమానులతో ఫొటోలు దిగడానికి ఎలాంటి అభ్యంతరం లేదని, కానీ కొందరు ప్రవర్తించే తీరు తీవ్ర ఆందోళన కలిగిస్తోందని స్పష్టం చేశారు. సమాజంలో సాధారణ మహిళలు కూడా నిత్యం ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి ధైర్యాన్ని మెచ్చుకోవాలని అనుపమ అభిప్రాయపడ్డారు.



# టాలీవుడ్‌లోకి 'సైయారా' బ్యూటీ ఎంట్రీ?

హైదరాబాద్, అక్టోబర్ 24 : మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న క్రేజీ ప్రాజెక్ట్ 'ఆర్సీ17'పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ సినిమా ఇంకా అధికారికంగా ప్రారంభం కాకముందే సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వైరల్ అవుతున్నాయి. ఇప్పటికే సంగీత దర్శకుడిగా అనిరుద్ ఖరారవ్వగా, తాజాగా హీరోయిన్ ఎంపిక అంశం చర్చనీయాంశంగా మారింది. చరణ్‌కు జోడీగా బాలీవుడ్ భామను తీసుకోవాలని భావిస్తున్న సుకుమార్.. ఈ క్రమంలో తాజాగా 'సైయారా' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న యువ హీరోయిన్ అనీత్ పడ్డా పేరు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. బాలీవుడ్‌లో 'సైయారా' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న అనీత్ పడ్డా.. ఇటీవల హైదరాబాద్‌లో ప్రత్యక్షం కావడంతో ఈ ఊహాగానాలు మరింత ఊపందుకున్నాయి. ఆమె ఈ ప్రాజెక్ట్ కోసమే నగరానికి వచ్చారంటూ అభిమానులు చర్చించుకుంటున్నారు. గతంలో కియారా అద్వానీ, సారా అర్జున్ పేర్లు వినిపించగా, ఇప్పుడు అనీత్ పేరు తెరపైకి వచ్చింది. ఇదిలాఉంటే, 'ఆర్సీ17' సినిమా పూజా కార్యక్రమాలను అక్టోబర్ 26 లేదా 27 తేదీల్లో నిర్వహించనున్నట్లు నిర్మాత మైత్రి రవి ఇటీవల వెల్లడించిన నేపథ్యంలో.. చిత్రంలో నటించే హీరోయిన్పై త్వరలోనే అధికారిక స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# దీపికా పదుకొణే.. బ్యాక్ టు షూట్!



ముంబై, అక్టోబర్ 24: బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణే మరోసారి కెమెరా ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. రెండోసారి తల్లి అయిన తర్వాత కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్న ఈ స్టార్ బ్యూటీ.. ఇప్పుడు తన పెండింగ్ షూటింగ్స్‌ను పూర్తి చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. షారుఖ్ ఖాన్ నటిస్తున్న 'కింగ్', అల్లు అర్జున్ నటిస్తున్న 'రాకా' సినిమాల్లో తనకు సంబంధించిన సన్నివేశాలను ఆమె పూర్తి చేయనున్నారు. ప్రెగ్నెన్సీ సమయంలోనూ షూటింగ్స్‌లో పాల్గొన్న దీపికా.. డెలివరీ సమయం దగ్గరపడటంతో కొంతకాలం విరామం తీసుకున్నారు. ఇటీవల మరో పాపకు జన్మనిచ్చిన ఆమె, ప్రస్తుతం మాతృత్వాన్ని ఆస్వాదిస్తూనే మళ్లీ సినిమాలపై దృష్టి పెట్టారు. అక్టోబర్ 26 నుంచి షారుఖ్ ఖాన్ 'కింగ్' సినిమా షూటింగ్‌లో దీపిక పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఈ షెడ్యూల్‌లో భాగంగా ముంబైలో ఓ పాటను చిత్రీకరించనుండగా, ప్రముఖ కొరియోగ్రాఫర్ వైభవి మర్చంట్ ఈ సాంగ్‌కు కొరియోగ్రఫీ చేయనున్నారు. మొదట ఈ పాటను దక్షిణాఫ్రికాలో తీయాలని భావించినప్పటికీ, దీపికా కాల్షీట్స్‌ను దృష్టిలో పెట్టుకుని లొకేషన్‌ను ముంబైకి మార్చినట్లు సమాచారం. 'కింగ్' పూర్తయ్యాక 'రాకా' సెట్స్‌లోకి ఆమె అడుగుపెట్టనున్నారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN**, and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

# మల్టీపర్పస్ వర్కర్ ను పరామర్శించిన ఉప సర్పంచ్



**ఉద్యమ కెరటం, తిర్యాణి:** తిర్యాణి గ్రామపంచాయతీ మల్టీ వర్కర్ లింగేష్కు పాము కాటు వేసింది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఉప సర్పంచ్ చేని కుమార్ శనివారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. వైద్యులతో ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. లింగేష్ ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు చెప్పడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మాట్లాడుతూ ఎవరైనా ఆపదలో ఉన్నప్పుడు ఆదుకునేందుకు ప్రతిఒక్కరు ముందుకు రావాలని కోరారు. గ్రామస్థులకు సేవలందించే ఉద్యోగుల సంరక్షణ కోసం తనవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట కారోబారి సుద్దాల తిరుపతి, గ్రామస్తులు ఉన్నారు.

# రోస్టర్ కేటాయింపులో మాలలకు తీవ్ర అన్యాయం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ (బోథ్ ):** రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అనంతరం రోస్టర్ కేటాయింపుల్లో మాలలకు అన్యాయం జరిగిందని, తిరిగి పూనః సమీక్షించాలని మాల, మాల ఉపకులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం బోథ్ మండల తహశీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలోని సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సంబంధిత గణాంకాలను పరిగణనలోకి తీసుకొని, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా రోస్టర్ కేటాయింపులు చేపట్టాలని సంఘం నాయకులు పేర్కొన్నారు. ఏ సామాజిక వర్గానికి అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. రోస్టర్ విధానంలో ఎస్సీ గ్రూప్ -3 వారికి 20 లోపు ఒక రోస్టర్ పాయింట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. మాల సామాజిక వర్గం హక్కులను విస్మరిస్తే ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఇది ఎవరికీ వ్యతిరేకంగా చేసే పోరాటం కాదని, మా హక్కుల సాధన, సమాన అవకాశాల కోసం చేసే న్యాయమైన పోరాటమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కుచులాపూర్ గ్రామ సర్పంచ్ మైలి నారాయణ, పసుల చంటి, కంది ప్రవీణ్, కురుమే గంగాధర్, కోల ప్రశాంత్, నాగార్జున, సాగర్, కుర్మే జానీ తదితరులు పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్టు పనులు వేగవంతం

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**ఉద్యమ కెరటం, ఖమ్మం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామంలో సత్తుపల్లి ట్రంక్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం పరిశీలించారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి భూ నిర్వాసితులకు పరిహార చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నవంబర్ రెండో వారంలో ఈ కాలువ ద్వారా గోదావరి జలాలను బేతుపల్లి చెరువు మీదుగా ఎన్టీఆర్ కెనాల్ ద్వారా వేంసూరు మండలానికి అందించనున్నట్లు తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించి మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి అశ్వారావుపేట నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాలకు సైతం గోదావరి జలాలను అందిస్తామని పేర్కొన్నారు. రైతుల సహకారంతోనే సాగునీటి ప్రాజెక్టుల పనులు ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉన్నతాధికారులు, నియోజకవర్గ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆన్లైన్ బుకింగ్తో మొక్కజొన్నల లోడ్ మాయం..ఇద్దరి అరెస్ట్

- 40,435 కిలోల మక్కజొన్నల అక్రమ విక్రయం
- లారీ, నకిలీ పత్రాలు స్వాధీనం





**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆన్లైన్ యాప్ ద్వారా లారీ బుకింగ్ చేసుకుని, 40,435 కిలోల మొక్కజొన్నలను దారి మళ్లించి విక్రయించిన ఇద్దరు నిందితులను ఆదిలాబాద్ టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వివరాలను శనివారం డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి వెల్లడించారు. హర్యానాకు చెందిన లారీ యజమాని రషీద్, రాజస్థాన్కు చెందిన డ్రైవర్ షౌకత్ ఖాన్ బ్లాక్బక్ యాప్ ద్వారా ఆదిలాబాద్ నుంచి కర్ణాటకకు మొక్కజొన్నల రవాణా బుకింగ్ పొందారు. జైనథ్లో 40,435 కిలోల మొక్కజొన్నలను లారీలో లోడ్ చేసుకుని, బాధితుడు రోహిత్ షిండే నుంచి రవాణా ఖర్చుల పేరుతో ఫోన్పే ద్వారా రూ.50వేలు తీసుకున్నారు. అనంతరం తప్పుడు నంబర్ ప్లేట్, నకిలీ లారీ పత్రాలతో సరుకును మధ్యప్రదేశ్కు తరలించి అక్కడ విక్రయించారు. సాంకేతిక ఆధారాలతో నిందితులను మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో పోలీసులు పట్టుకున్నారు. నేరానికి ఉపయోగించిన టాటా లారీ, నకిలీ పత్రాలు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు ఛేదనలో టూటౌన్ సీఐ నాగరాజు, పోలీసు సిబ్బంది కీలకంగా వ్యవహరించారు. సరుకు రవాణాకు వాహనాలను బుక్ చేసుకునే సమయంలో వాటి రిజిస్ట్రేషన్ వివరాలు, పత్రాలను పరిశీలించాలని సూచించారు.

# అర్హులైన పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించాలనే ఉద్దేశంతో వేంసూరు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటు నమోదు సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వేంసూరు ప్రధాన కేంద్రంతో పాటు మర్లపాడు, భీమవరం, కందుకూరు, ఆడసర్లపాడు, బీరపల్లి గ్రామాల్లో ఈ సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. అర్హులైన పట్టభద్రులందరూ ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకుని ఎమ్మెల్సీ ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేంసూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు వెల్ది జగన్మోహన్ రావు, వేంసూరు గ్రామ సర్పంచ్ ఎండీ ఫకృద్దీన్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పుచ్చకాయల సోమిరెడ్డి, మర్లపాడు గ్రామ సర్పంచ్ కనమాల ఆంధ్రయ్య, ఉప సర్పంచ్ రాఘవరెడ్డి, రేగళ్ల శ్రీనివాసరెడ్డి, వంట్ల కృష్ణార్జునరావు, యర్ర సత్యనారాయణ, మెడా వెంకటేశ్వరరావు, అట్లూరి సత్యనారాయణరెడ్డి, నాయుడు బాపూజీ, జెట్టి రామారావు, కర్రీ నాగేశ్వరరావు, బండారు శ్రీను, గజ్జెల్లి నాగరాజు, ఉప సర్పంచ్ గున్నేని సురేష్, గరికపాటి శ్రీను, కరుణాకర్ రెడ్డి, ఇమ్మడి శివ, దాసరి రామకృష్ణరెడ్డి, విశ్వేశ్వరరావు, బీరపల్లి గ్రామ సర్పంచ్ మందపాటి వెంకటరెడ్డి, కనుమతరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, గొర్ల వెంకటప్పరెడ్డి తదితర నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నీరు, విద్యుత్ వృథా చేస్తే కఠిన చర్యలు

**జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వర్**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఎల్నినో ప్రభావంతో రానున్న వేసవిలో తలెత్తే నీటి ఎద్దడి, విద్యుత్ సమస్యలను ఎదుర్కొనేందుకు ఆదిలాబాద్ జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టిందని జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ ఆధ్వర్యంలో జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం మున్సిపల్ అధికారులు, టౌన్ ప్లానింగ్ ఇంజనీర్లు, వాణిజ్య సంస్థల ప్రతినిధులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యుత్ కొరతను అధిగమించేందుకు షాపింగ్ మాల్స్, ఫంక్షన్ హాళ్లు, హోటళ్లు, పెద్ద విద్యాసంస్థలు తప్పనిసరిగా సోలార్ విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే ఆదిలాబాద్కు తాగునీరు అందించే శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో సాధారణంగా ఉండాల్సిన 90 టీఎంసీలకు గానూ ప్రస్తుతం కేవలం 36 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నీరు ఫిబ్రవరి, మార్చి వరకే సరిపోతుందని, ప్రజలు, వ్యాపార సంస్థలు నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు. ప్రతి ఇంటి యజమాని తప్పనిసరిగా ఇంకుడుగుంతలు నిర్మించుకుని భూగర్భ జలాలను పెంపొందించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి నీరు, విద్యుత్ను వృథా చేసే సంస్థలపై భారీ జరిమానాలు విధించడంతో పాటు, అవసరమైతే వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేసి, నీటి పొదుపును సామాజిక బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు, వ్యాపార రంగ ప్రముఖులు పాల్గొన్నారు.

# పీఎం రహత్ పథకం ద్వారా రోడ్డు ప్రమాద బాధితులకు చికిత్స





- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** పీఎం రహత్ పథకం ద్వారా రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1లక్ష 50వేల వరకు ఉచిత చికిత్స అందించడం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీస్ ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రహదారి ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సత్వర వైద్య సహాయం అందించి, ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. పోలీసుల ఆమోదం పొందిన కేసుల్లో అర్హులైన రహదారి ప్రమాద బాధితులకు గరిష్ఠంగా రూ.1లక్ష 50వేల వరకు ఉచిత చికిత్స అందించేందుకు అవకాశం ఉందని తెలిపారు. ప్రమాదం జరిగిన తేదీ నుంచి ఏడు రోజుల వ్యవధికి సంబంధించిన చికిత్స సదుపాయం ఉంటుందని, రోడ్డు ప్రమాద వివరాలను నిర్ధారించేందుకు జిల్లా పోలీసులకు 24 గంటల గడువు ఉంటుందన్నారు. ట్రాన్సాక్షన్ మేనేజ్మెంట్ సిస్టమ్ 2.0, ఎలక్ట్రానిక్ డిటైల్డ్ యాక్సిడెంట్ రిపోర్ట్ ద్వారా బాధితుల వివరాలు, ప్రమాద వివరాలు, కేసు స్థితిని అనుసంధానించడం జరుగుతుందని తెలిపారు. 112 అత్యవసర సేవలతో అనుసంధానం ద్వారా ప్రమాద బాధితులకు సత్వర వైద్య సహాయం అందించే వ్యవస్థను బలోపేతం చేయడం జరిగిందని అన్నారు. బాధితులకు అందించిన చికిత్సకు సంబంధించి ఆసుపత్రులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రమాద స్థలం, బాధితుడి వివరాలను సంబంధిత డీఎస్పీకార్యాలయం, పోలీస్ స్టేషన్కు పంపిస్తారని చెప్పారు. సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు ప్రమాద స్థలాన్ని, ప్రమాదంలో బాధితుడి ప్రమేయాన్ని పరిశీలించి, నమోదైన కేసుతో బాధితుడి వివరాలను అనుసంధానిస్తారని తెలిపారు. అవసరమైతే కొత్త ప్రమాద కేసు గుర్తింపు సంఖ్యను రూపొందిస్తారని, అనంతరం ఈ డిఎఆర్ లోని బాధితుడి గుర్తింపు సంఖ్యను టిఎంఎస్ బాధితుడి గుర్తింపు సంఖ్యతో అనుసంధానించి, సంబంధిత సమాచారాన్ని ఆసుపత్రికి అందిస్తారని తెలిపారు. పథకం అమలును పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులతో మాట్లాడుతూ పీఎం రహత్ పథకం అమలు విధానంపై సంబంధిత డేటాఎంట్రీ ఆపరేటర్లకు సమగ్ర శిక్షణ అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో పథకం అమలులో ఎలాంటి లోపాలు లేకుండా, నిర్దేశించిన విధానాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిపి ఎ.భాస్కర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్, జిల్లా రవాణా అధికారి, ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ సత్యనారాయణ, జైపూర్ ఎసిపి వెంకటేశ్వర్లు, ఈడి ఎఆర్ జిల్లా మేనేజర్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్పై నాయకుల వైఖరి ఏమిటి



**ఉద్యమ కెరటం, జవహర్నగర్:** రాంకీ చెత్త డంపింగ్ యార్డు ప్రభావిత ప్రాంతాల ప్రజల ఆరోగ్య భద్రత, పర్యావరణ పరిరక్షణ కోసం గత ఐదు నెలలుగా జరుగుతున్న ఉద్యమాన్ని సీపీఐ (ఎంఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలి స్వాగతించారు. ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి అఖిలపక్షం నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. జవహర్నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో సాగుతున్న ఉద్యమం ద్వారా ప్రజల్లో పెరిగిన చైతన్యాన్ని గుర్తించిన ఎంపీ, ఎమ్మెల్యేలు ఆమరణ నిరాహార దీక్షలు, సన్నాహక సమావేశాలపై ప్రకటనలు చేయడాన్ని షేక్ షావలి స్వాగతించారు. మే 4, మే 24 తేదీల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశాల ద్వారా బాధితులకు ఎలాంటి పరిష్కారం లభించలేదని విమర్శించారు. బాధితుల సమస్యలకు పరిష్కారం చూపని అఖిలపక్షంలో ఎంపీ, ఎమ్మెల్యేలు కొనసా గాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ డంపింగ్ యార్డు తొలగింపునకు కేంద్ర ప్రభుత్వం సాయం చేయడానికి సిద్ధమని ప్రకటించిన నేపథ్యంలో, కీలక అనుమతులను ఉపసం హరించుకునేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావాలని కోరారు. ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యంతో ఉద్యమాన్ని బలోపేతం చేయాలని, బాధిత ప్రజల్లో నెలకొన్న భయాలు, అపోహలను తొలగించేందుకు ఎంపీ, ఎమ్మెల్యేలు నిజాయితీగా కలిసి పని చేయాలని సూచించారు. డంపింగ్ యార్డు ప్రభావిత ప్రాంతాల ప్రజలు ఏ రాజకీయ పార్టీకి వ్యతిరేకం కాదని, అదే సమయంలో ఏ నాయకుడికీ ప్రత్యేకంగా అనుకూలం కాదని గుర్తించాలన్నారు. రాజకీయాలకు అతీతంగా డంపింగ్ యార్డు ఎత్తివేతే ఈ ప్రాంత ప్రజల తక్షణ అవసరమని పేర్కొన్నారు. ఈ లక్ష్యంతో ఎవరైనా దీక్ష చేపడితే ప్రజలు స్వాగతిస్తారని తెలిపారు. వేర్వేరు కార్యక్రమాలతో ప్రజలను విడగొట్ట వద్దని సూచించారు. ఎన్నో ఏళ్లుగా ధమ్మాయిగూడ జేఏసీ, జవహర్నగర్ ప్రజా హక్కుల పరిరక్షణ పోరాట కమిటీ నుంచి నేటి జవహర్నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ వరకు ఉద్యమంలో భాగస్వాములైన వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, పౌర ప్రజాస్వామిక ఉద్యమ నాయకులను ఒకే వేదికపైకి తీసు కురావాలని కోరారు. డంపింగ్ యార్డు ఎత్తివేత లక్ష్యంగా ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి సంయుక్తంగా ముందుకు వచ్చి, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో కలిసి ఐక్య కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు.

# అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు.. పీతుర్ కుంట ధ్వంసం!





## • జేసీబీతో తవ్వకాలు.. టిప్పర్లతో అక్రమ రవాణా

**ఉద్యమ కెరటం, హత్నూర:** ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ, ఎలాంటి అనుమతులు లేకుండానే మట్టి తవ్వకాలు చేపడుతున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామంలోని పీతుర్ కుంటలో జేసీబీల సహాయంతో మట్టిని తవ్వి, టిప్పర్ల ద్వారా అక్రమంగా తర లిస్తున్నారు. ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టడంతో కుంట ఉనికికే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని స్థానికులు ఆరో పిస్తున్నారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే యధేచ్ఛగా జేసీబితో మట్టిని తవ్వి టిప్పర్ల ద్వారా తరలిస్తు న్నారని, తవ్వకాల కారణంగా కుంటలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడుతున్నాయని చెబుతున్నారు. ఇందులో పశువులు, ఇతర మూగజీవాలు నీటి కోసం వెళ్లే సమయంలో గుంతల్లో పడితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి తవ్వకాలను అరికట్టి కుంటను పరిర క్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

### ఎలాంటి అనుమతులు లేవు..

పీతుర్ కుంటలో జరుగుతున్న మట్టి తవ్వకాలపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను వివరణ కోరగా, తమ శాఖల నుంచి ఎలాంటి అనుమతులు మంజూరు చేయలేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై సమాచారం అందిన వెంటనే రెవెన్యూ అధికారులు తవ్వకాలు జరిగిన ప్రాంతానికి వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు. కుంటలో మట్టి తవ్వకాలు జరిగిన విషయం వాస్తవమేనని, అనుమతులు లేకుండా తవ్వకాలు చేపట్టిన వారిని గుర్తించేందుకు పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు వివరించారు. అనుమతులు లేకుండా కుంటలో మట్టి తవ్వకాలు చేపట్టిన వారిని గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. అయితే కుంటలో తవ్వకాలు చేపట్టినవారు ఎవరు, మట్టిని ఎక్కడికి తరలిస్తున్నారనే ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

### ఉన్నతాధికారులు స్పందించాలి..

పీతుర్ కుంటలో అక్రమ తవ్వకాలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. కుంటలో ఏర్పడిన భారీ గుంతలను పరిశీలించి, ప్రజలకు, మూగజీవాలకు ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# హెచ్ఐవీ, టీబీ వ్యాధులపై అవగాహన

**ఉద్యమ కెరటం, హత్నూర:** హెచ్ఐవీ, టీబీ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్పందన ఆర్గనైజేషన్ ఫర్ ఎడ్యుకేషన్ స్కోప్ ఆధ్వర్యంలో శనివారం సంగారెడ్డి జిల్లా హత్నూర మండల కేంద్రంలో కళాజాతి ప్రదర్శనలు నిర్వహించారు. స్థానిక సర్పంచ్ నల్లోల్ల ఎల్లయ్య, ఉప సర్పంచ్ చెక్క మానస రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాకారులు తమ ప్రదర్శనల ద్వారా వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ మాట్లాడుతూ హెచ్ఐవీ, టీబీ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యాధుల లక్షణాలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నగేష్, కొండగళ్ల రవికుమార్, ప్రభు, పొట్లగళ్ల ప్రవీణ్, నగేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా రాజీవ్ గాంధీ విగ్రహ ఆవిష్కరణ

**ఉద్యమ కెరటం, దుబ్బాక:** దుబ్బాక మండల కేంద్రంలో దివంగత భారత ప్రధాని రాజీవ్ గాంధీ నూతన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. విగ్రహ ఆవిష్కరణ అనంతరం నాయకులు, కార్యకర్తలు ప్రజలకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. సాంకేతిక రంగంలో దేశాన్ని ముందంజలో నిలిపిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. ఈ కార్యక్ర మానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ, జిల్లా స్థాయి నాయకులు, మార్కెట్ కమిటీ చైర్మన్ కొంగరి రవి, వైస్ చైర్మన్ బాల్ రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ చంద్రా రెడ్డి, మండల ప్రెసిడెంట్ నరేందర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్, జనార్ధన్ రెడ్డి, కోమటి రెడ్డి పద్మ రెడ్డి, కౌన్సిలర్ సరస్వతి నరేందర్, మాజి మార్కెట్ కమిటీ చైర్మన్ చెక్కపల్లె పద్మన్న, సర్పంచ్లు బానోతు రామ్ జా, శ్రీనివాస్, ముఖ్య నాయకులు కర్రోల్ల చంద్రం, నరేష్, ఆకుల భరత్, మెట్ల సంజు, పల్లవి, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో దోహ దపడతాయని సత్తుపల్లి రూరల్ సీఐ సర్వయ్య, వేంసూరు ఎస్సై ప్రదీప్ అన్నారు. ఖమ్మం జిల్లా వేంసూరు పోలీస్ స్టేషన్లో శనివారం మండల పరిధిలోని అన్ని గ్రామాల సర్పంచులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ కోసం ప్రతి గ్రామంలో తప్పని సరిగా సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకో వాలని సర్పంచులకు సూచించారు. గ్రామాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటుతో దొంగతనాలను అరికట్టడంతో పాటు అపరిచిత వ్యక్తుల కదలికలను గుర్తించేందుకు అవకాశం ఉంటుందని సీఐ తెలిపారు. ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగినప్పుడు నిందితులను గుర్తించ డంలోనూ సీసీటీవీ కెమెరాలు కీలకంగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కోసం గ్రామాల సర్పంచులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రతి గ్రామంలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు సర్పంచులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు.



# సహజ ఎరువులతో నేల ఆరోగ్యం మెరుగు



**ఉద్యమ కెరటం, తాండూర్:** సహజ ఎరువుల వినియోగంతో నేల ఆరోగ్యం మెరు గుపడుతుందని మండల వ్యవసాయ అధికారి సుష్మ అన్నారు. మండలంలోని ద్వారకాపూర్ గ్రామ పంచాయితీ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయాన్ని రక్షించుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. సహజ ఎరువుల వినియోగం, నీరు, ఇతర వనరులను పరిరక్షించడం, సుస్థిర పోషక యాజమాన్యాన్ని వేగవంతం చేయడం కోసమే ఈ కార్యక్రమాన్ని చేప డుతున్నట్లు పేర్కొన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు, ఇతర వ్యవసాయ ఉత్పాదకాల సమతుల్య వినియోగాన్ని ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. సేంద్రియ, జీవ ఉత్పత్తుల వినియోగం, ప్రకృతి సేద్యంపై రైతులకు అవగాహన కల్పించారు. నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ, వర్షపు నీటి సేకరణ, "పర్ డ్రాప్ మోర్ క్రాప్ గురించి వివరించారు. సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ, వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయం, సుస్థిర వ్యవసాయ పద్ధతుల గురించి తెలియజేశారు. ప్రస్తుతం ఎల్ నినో కారణంగా రాబోయే యాసంగిలో వరికి బదులు ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి రాకేష్, రైతులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి కూలీకి పని కల్పించాలి

## ఎంపీడీఓ కృష్ణవేణి



**ఉద్యమ కెరటం, జైనూర్:** అర్హులైన ప్రతి కూలీకి పని కల్పించాలని జైనూర్ ఎంపీడీఓ కృష్ణవేణి అన్నారు. మండలంలోని పోచంలొద్ది, ఉషేగం గ్రామపంచాయతీల పరిధిలో కూలీలు చేపడుతున్న పనులను శనివారం సిబ్బందితో కలిసి పరిశీ లించారు. వీబీజీ రామ్జీ పథకం ద్వారా ఫామ్పాండ్లు, ఇంకుడు గుంతల నిర్మాణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా భూగర్భ జలాల మట్టాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గ్రామాల్లో ఈ పనులను అధికంగా చేపట్టి కూలీలకు ఉపాధి కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం ఉషగం గ్రామంలో కూలీలతో కలిసి ఎంపీడీఓ, పథకం సిబ్బంది అల్పాహారం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఆత్రం నిర్మల, శశిపాల్, మడావి మనోహర్, ఏపీవో నగేష్, టెక్నికల్ అసిస్టెంట్లు ఉపేందర్, లింగేశ్వర్, పంచాయతీ కార్యదర్శి సురేఖ, ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు పాల్గొన్నారు.

# సిరిసిల్ల టాస్క్ లో ఉచిత శిక్షణ

## జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** సిరిసిల్ల టాస్క్ (తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్) రీజనల్ సెంటర్లో టెక్నీకల్ కోర్సులు, బ్యాంకింగ్ బీఎస్ ఎఫ్ ఐలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఏదైనా డిగ్రీ పూర్తి అయిన అభ్యర్థులు అర్హులని స్పష్టం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయ కార్యాలయంలో ఉన్న టాస్క్ రీజనల్ సెంటర్ లో ఈనెల 27వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని, అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. టాస్క్ లో శిక్షణ పొందిన అభ్యర్థులకు మంచి ప్యాకేజీలతో ఉపాధి అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం సెల్:9573420718, 7075522671లలో సంప్రదించాలని సూచించారు.

